



కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వరస్వామి దేవస్థానం



కొల్లిపర మండలంలో ఒడ్డు వెంటే నీరు బయటకు వచ్చేలా 11 అడుగుల పైగా లోతులో ఇసుక తవ్విపోస్తున్న చిత్రం

ఇసుక.. మస్కా

- తవ్వకాలు ఆగిందే లేదు
- అడ్డే లేకుండా అక్రమాలు
- బ్యారేజీకి దిగువన రెట్టింపైన తవ్వకాలు
- కలెక్టర్ల పర్యటన తర్వాత మరింత విచ్చలవిడిగా..
- నేటికీ అమరావతి, అచ్చంపేట, క్రోసూరుల్లో క్వారీయింగ్
- యంత్రాలు వినియోగించడం లేదని అబద్ధపు నివేదికలు
- ఉపగ్రహ చిత్రాలను అందించి కౌంటర్ ఇచ్చిన కమిటీ

గుంటూరు, తెనాలి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ కొరడా ఝళిపించిన, స్వయానా జిల్లా కలెక్టర్లే రీచ్‌లపై దాడులు చేసినా, ఇసుక అక్రమ తవ్వకాలు మాత్రం అడ్డుకట్టే పడలేదు. యంత్రాలతో తవ్వకూడదని, భారీ వాహనాలను నదిలో దింపకూడదనే నీటి ప్రవాహాలకు దగ్గరలో కాని నీరు బయటపడేంతగా కానీ ఇసుక తవ్వకూడదనే నిబంధనలను, వాల్టా చట్టం ఆదేశిస్తున్న ఎక్కడా నిబంధనలు అమలుకే నోచుకోకుండా పోతోంది. భారీ యంత్రాలు పెట్టి పది నుంచి 15 అడుగుల లోతు తీస్తూ ఇసుకను తవ్వేస్తూ భూగర్భ జలాలకు ముప్పు ఏర్పడేలా చేస్తుంటే మరోపక్క అనుమతులు ఒక చోట ఉంటే వారి ఇష్టం వచ్చిన తవ్వేస్తూ అడ్డగోలు ఇసుక క్వారీయింగ్‌కు తెగబడుతున్నారు. ఇంత దారుణాలు ఇసుక రీచ్‌లలో బహిరంగంగానే జరుగుతున్నా రెవెన్యూ, పోలీసు శాఖలు కానీ హద్దులు నిర్ణయించి తవ్వకాలు పర్యవేక్షించాల్సిన మైనింగ్ శాఖ కానీ కన్నెత్తి కూడా చూడటం లేదంటే అధికార పార్టీ నేతల దందా ఏ మేర కొనసాగుతుందో అర్థమవుతుంది. ప్రకాశం బ్యారేజీ దిగువన గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో కేవలం మూడు చోట్లే ఇసుక రీచ్‌లకు అనుమతులు ఇస్తే మరో ఆరుచోట్ల అనధికారికంగా తవ్వకాలు జరిపిస్తున్నారు. పాతూరు, పెదకొండూరు, వల్లభాపురం, మున్నంగి, బొమ్మువానిపాలెం, గాజుల్లంక, జువ్వలపాలెం, పెనుమూడి రేవుల దగ్గర ఇసుకను విచ్చవిడిగా తవ్వేస్తున్నారు. ఇటీవల రెండు జిల్లాల కలెక్టర్లు కొల్లూరు మండలం జువ్వలపాలెం, కొల్లిపర మండలంలో రీచ్‌లను పరిశీలించిన సంగతి తెలిసిందే. కలెక్టర్ వచ్చిన సమయంలో కొన్ని గంటలు మాత్రమే ఇసుక తవ్వకాలు నిలిపి వేసి రీచ్‌ల నుంచి కలెక్టర్‌లు అడుగు బయట పెట్టిన వెంటనే మళ్లీ అక్రమ తవ్వకాలను యథావిధిగా కొనసాగించారు. ఎక్కడా ఆపిన దాఖలాలే లేవు. తాజాగా మరో 10 రీచ్‌లకు మైనింగ్ శాఖ అనుమతులు ఇచ్చింది. సర్వే నెంబర్ల ప్రకారం ఎంత ఇసుక తియ్యాలనే పరిమాణాన్ని కూడా నిర్ణయించింది. ప్రస్తుతం కేటాయించిన రీచ్‌ల సర్వే నెంబర్లలో ఇసుక తవ్వకాలు జరపాలంటే మరో వారం పది రోజులు అన్ని అనుమతులు సమయం పడుతుంది. అయితే ఇప్పుడు కొత్తగా ఇచ్చిన రీచ్‌లలో కొన్ని రీచ్‌లు ఇప్పటికే ఇసుక తవ్వేసి ఉండటం విశేషం. టన్ను నుంచి రెండు టన్నులు పైగా ఒకేసారి ఇసుకను తవ్వగలిగే బొచ్చలు ఉన్న పొక్లెయిన్లతో ఇసుక తోడేస్తుంటే నదీ అడుగు ఉన్న నీరు కూడా బయట పడి భూగర్భ జలాలకు ముప్పు ఏర్పడుతూనే ఉంది.

కొల్లిపర, మంగళగిరి మండలాల పరిధిలో రైతులు, స్థానికులు నీటి ఇబ్బందులతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఎండ వేడి పెరుగుతుండటం, రానున్నది వేసవి కావడంతో భూగర్భ జలాలు మరింత అడుగంటి పోతే గుక్కెడు నీరు తాగడానికి అవస్థలు పడాల్సిందేనని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. మరోపక్క జగనన్న కాలనీలకు మెరకలు తోలేందుకు గడిచిన రెండేళ్ల నుంచి బుసక కోసం అనుమతులు పెట్టుకుని విచ్చలవిడిగా ఇసుకను తరలించేస్తున్న పరిస్థితులు కూడా ఉన్నాయి. బొమ్మువానిపాలెం, చిలుమూరు, జువ్వలపాలెం ప్రాంతాల్లో ఏ అనుమతులు లేకపోయినా బుసక తవ్వకాలు జరుగుతున్నాయంటూ అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు, ఇసుక, బుసక తరలింపు అక్రమాలకు పాల్పడుతున్నారు. ఎన్‌జీటీ ఉత్తర్వులు, కలెక్టర్ల ఆకస్మిక తనిఖీలతో ఇప్పటికైనా ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట పడుతుందని కృష్ణా పరివాహక ప్రాంత గ్రామాల ప్రజలు ఆశ పడితే ఎక్కడా వీటికి అడ్డుకట్ట పడలేదు. కలెక్టర్ల తనిఖీలకు ముందు జరిగిన తవ్వకాలకు రెట్టింపు చేసి మరీ అక్రమ తరలింపులకు తెగబడుతుండటం విశేషం.



జీసీకేసీ పేరుతో ఇస్తున్న బిల్లు

సుప్రీంకోర్టు తీర్పుపై ఉత్కంఠ

ఎన్‌జీటీ ఆదేశాల మేరకు ఇటీవలే రెండు జిల్లాల కలెక్టర్లు వారి పరిధిలో ఇసుక రీచ్‌లకు వెళ్లారు. ఆ సమయంలో కొంతమంది సిబ్బంది ముందుగానే వారికి సమాచారం ఇచ్చి యంత్రాలను కనిపించకుండా చేశారు. దాంతో ఇసుక తవ్వకాలు అంతా సవ్యంగా సాగుతున్నట్లు కలెక్టర్లు నివేదికలను ఎన్‌జీటీకి సమర్పించారు. రెండు జిల్లాల్లో ఎక్కడా ఇసుక తవ్వకాలు అనుమతులకు విరుద్ధంగా జరగడం లేదని, యంత్రాలు అసలే వాడటం లేదని వారిచ్చిన నివేదికల్లో పేర్కొన్నారు. అయితే కేంద్ర పర్యావరణ అటవీశాఖ కమిటీ మాత్రం యంత్రాలను వినియోగిస్తున్నారని, అనుమతుల్లేని చోట్ల తవ్వుతున్నారని పేర్కొన్నది. కలెక్టర్ల నివేదికలు అవాస్తవమని కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ కమిటీ పేర్కొన్నది. రీచ్‌ల వద్దనే టన్నుకు రూ.475 వసూలు చేస్తున్నారు. ఒక్కో రీచ్ నుంచి నిత్యం వెయ్యి నుంచి 2 వేల టన్నుల వరకు ఇసుకని యంత్రాల ద్వారా తీస్తున్నట్లు నివేదించింది. ఉపగ్రహం ద్వారా ఇసుక అక్రమ తవ్వకాలకు సంబంధించి సేకరించిన చిత్రాలను ఎన్‌జీటీకి సమర్పించింది. ఈ నేపథ్యంలో ఈ కేసుపై తుది తీర్పుని సుప్రీంకోర్టు విచారణ జరిపి ఇవ్వనున్నది. దీంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది. సుప్రీంకోర్టు కనుక శాస్త్రీయ ఆధారాలు, కేంద్ర కమిటీ నివేదికలను పరిగణనలోకి తీసుకుంటే అధికారులకు చిక్కులు తప్పవన్న అభిప్రాయం వ్యక్తమౌతున్నది.

అక్రమాలు కోకొల్లలు..

ప్రకాశం బ్యారేజ్ ఎగువున గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో పలుచోట్ల ఇసుక అక్రమ తవ్వకాలు నేటికీ కొనసాగుతోన్నాయి. అమరావతి మండలం వైకుంఠపురం రీచ్ వద్ద ఎలాంటి పర్యావరణ అనుమతులు లేవు. దిడుగు, పొందుగల రీచ్‌లకు ఈసీ అనుమతులు ఉన్నప్పటికీ అక్కడ ఎలాంటి యంత్రాలు వినియోగించరాదు. అయితే అక్కడ ఎప్పుడు వెళ్లి చూసినా భారీ ఎక్స్‌కవేటర్లతో లారీలు, ట్రక్కుల్లోకి ఇసుక లోడింగ్ జరుగుతుంటుంది. వైకుంఠపురం రీచ్‌లో ఇసుక నీటిలో ఉంటుంది. ఈ కారణంగా నాణ్యత ఎక్కువగా ఉంటుండటంతో డిమాండ్ అధికంగా ఉన్నది. దీంతో ఇక్కడ డ్రెడ్జర్లు, ఎక్స్‌కవేటర్లతో ఇసుకని తోడేస్తున్నారు. తుళ్లూరు మండలం రాయపూడిలో మూడు రోజుల క్రితం ఇసుక తవ్వకాలు చేపట్టగా టీడీపీ నాయకులు వెళ్లి అడ్డుకోవడంతో అక్కడ తాత్కాలికంగా ఇసుక తవ్వకాలు నిలిచాయి. పల్నాడు జిల్లా అచ్చంపేట మండలంలో కోనూరు, అంబడిపూడిలో కలిపి మొత్తం ఆరు చోట్ల మాత్రమే ఈసీలున్నాయి. కోగంటివారిపాలెం, కస్తల, చామర్తి, కొత్తపల్లిలోనూ ఇసుక తవ్వకాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. 200 ఎక్స్‌కేవేటర్లు పెట్టి కోగంటివారిపాలెంలో నిత్యం 100 లారీలకు పైగా ఇసుకని తోడేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.

నిధుల్లేవ్

- సంక్రాంతి.. కొండవీడు ఉత్సవాలకు నిధులు
- వీటికి రూ.40 లక్షలకు పైగా ఖర్చు
- కోటప్పకొండ తిరునాళ్లకు నిధులు లేవట..!
- తిరునాళ్ల ఏర్పాట్లకు పంచాయతీల నుంచి వసూళ్లు
- రాష్ట్ర పండుగ హోదాతో సరిపుచ్చుతున్న ప్రభుత్వం
- ఏటా తిరునాళ్ల ఏర్పాట్లకు నిధుల తంటా

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి సంబరాలు.. కొండవీడు ఉత్సవాలకు లక్షలు ఖర్చు చేశారు. నెల రోజుల వ్యవధిలో ఈ రెండింటికి దాదాపు రూ.40లక్షల ప్రభుత్వ నిధులను వెచ్చించారు. వీటికి నిధులు విడుదల చేసిన అధికారులు కోటప్పకొండ తిరునాళ్ల ఏర్పాట్లకు నిధులు లేవని చెబుతుండటం వారి చిత్తశుద్ధిని తెలియజేస్తోంది. కోటప్పకొండ శ్రీత్రికోటేశ్వర స్వామి సన్నిధిలో మహాశివరాత్రి సందర్భంగా 8న జరగనున్న తిరునాళ్లకు దేశ నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలి వస్తారు. తిరునాళ్లకు రాష్ట్ర పండుగ హోదా కల్పిస్తున్న ప్రభుత్వం నిధుల విడుదలను విస్మరిస్తోంది. గత ఐదేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొంది. ఏర్పాట్లకు చందాలపైనే ఆధారపడాల్సివస్తోంది. తిరునాళ్ల ఏర్పాట్ల కోసం జిల్లాలోని పంచాయతీ నుంచి వసూలుకు కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదేశాలు జారీ చేశారు. అసలే నిధుల లేమితో గ్రామాల్లో పనులు చేయలేని పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో తిరునాళ్ల భారాన్ని పంచాయతీలపై మోపడాన్ని కొందరు సర్పంచ్‌లు వ్యతిరేకిస్తున్నారు.

నిధుల దుబారా..

సంక్రాంతి సంబరాలు, కొండవీడు ఉత్సవాల పేరుతో లక్షల్లో ప్రభుత్వ నిధులను ఖర్చు చేశారు. కొందరు అధికారులు వారి కోర్కెలు తీర్చుకొనేందుకే వీటిని నిర్వహించారన్న విమర్శలున్నాయి. కేవలం నృత్యాల కోసం నిధులు దుబారా చేశారన్న ఆరోపణలు కూడా వచ్చాయి. గత రెండేళ్లుగా సంక్రాంతి సంబరాలకు రూ.20లక్షల నుంచి రూ.25 లక్షల వరకు ఏటా ఖర్చు చేశారు. అలాగే కొండ వీడు ఉత్సవాలకు లక్షల్లో నిధులు వెచ్చిం చారు. ఏ నిధులు విడుదల చేశారన్న అంశంపై నేటివరకు వెల్లడించ లేదు. దీంతో ఆయా కార్య క్రమాల నిర్వహణలో పారదర్శకత లేదన్న ఆరోపణ ఉన్నాయి. ఇప్పటికైనా ఆ ఈవెంట్‌లకు ఎంత ఖర్చు చేశారన్న అంశాన్ని వెల్లడించాలన్న వాదన కూడా వినిపిస్తోంది. ఈ నిధులను విడుదల చేయడంలో కృషి చేసిన అధికారులు తిరునాళ్లకు మాత్రం నిధులు సమకూర్చే విషయంలో వారికి చిత్తశుద్ధి కొరవడిందన్న విమర్శలున్నాయి.

ఏసీని సెలవులో పంపించారు..

కోటప్పకొండ దేవస్థానంలో అధికార పార్టీ జోక్యం అధికమైంది. సదరు నేతలు అనుమతిస్తేనే ఇక్కడ విధులు నిర్వహించాల్సిన దుస్థితి. దేవస్థానాన్ని ఏసీ క్యాడర్‌కు అప్‌గ్రేడ్ చేశారు. ఏసీని విధుల్లో చేరకుండా అధికార పార్టీ నేతలు అడ్డుకున్నారు. సెలవులో వెళ్లాలని, తిరునాళ్ల తర్వాత వచ్చి విధుల్లో చేరాలని ఏసీని హెచ్చరించారు. దీంతో సెలవులో ఏసీ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి వెళ్లారు. ఇన్‌ఛార్జ్ ఈవో జి.శ్రీనివాసరెడ్డి కొనసాగుతున్నారు. ఈవో కూడా నిబంధనలు పాటించకుండా విధుల్లో కొనసాగుతుండటం గమనార్హం. ఏసీ విధుల్లో చేరితే తిరునాళ్ల కొనుగోళ్లలో అవకతవకలకు అవకాశం ఉండదనే ఉద్దేశ్యంతోనే ఆయనను సెలవులో పంపించి వేశారన్న ఆరోపణలున్నాయి. ఏ సరుకులు ఎంతకు కొనుగోలు చేస్తున్నారన్న అంశాన్ని బహిర్గతం చేయడంలేదు. ఇప్పటికైనా సరుకులు, ఇతర సామాగ్రి కొనుగోళ్లకు సంబంధించిన రేట్లను అధికారికంగా వెల్లడిస్తే అపోహలు, ఆరోపణలకు తావుఉండదు. దేవస్థానం కోసం చేస్తున్న సామాగ్రి రేట్ల వెల్లడించేందుకు ఈవో స్పందిస్తారా?, ఆరోపణలకు బలం చేకురుస్తారో వేచి చూడాలి.

ఐదేళ్లుగా తిరునాళ్లకు నిధులు ఇవ్వని ప్రభుత్వం

తిరునాళ్లకు గత ఐదేళ్ల నుంచి ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు విడుదల చేయడంలేదు. కాంగ్రెస్, తెలుగుదేశం ప్రభుత్వాలు ఏటా తిరునాళ్లకు రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షలు వసూలు విడుదల చేశాయి. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఒక్క తిరునాళ్లకు కూడా ప్రత్యేకంగా నిధులు విడుదల చేయకపోవడం గమనార్హం. ఈ ఏడాది కూడా ఇప్పటివరకు నిధుల ఊసే ప్రభుత్వం ఎత్తలేదు. తిరునాళ్ల ఏర్పాట్లకు ఈసారి కూడా పూర్తిగా చందాలపైనే ఆధార పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఒకటి కల్లా పంచాయతీలు ఉత్తర్వుల్లో పేర్కొన్నా విధంగా కొండకావూరు పంచాయతీ ఖాతాకు జమ చేయాలని ఉత్తర్వుల్లో తెలిపారు. తిరునాళ్లలో పారిశుధ్య పనుల కోసం పంచాయతీల నుంచి నిధులు సేకరిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి విజయభాస్కరరెడ్డి తెలిపారు. పంచాయతీల నుంచి 20 ఏళ్లుగా నిధులు సమకూర్చునట్లు చెప్పారు.

వీఐపీల బస్సులకు నిధులు చెల్లిస్తామని హామీ

తిరునాళ్లకు వచ్చే వీఐపీల సేవలో అధికారులు తరిస్తున్నారు. వీరికి ఏర్పాట్లు చేయడానికి ఇస్తున్న ప్రాధాన్యం సామాన్య భక్తులకు ఇవ్వడం లేదన్న విమర్శలున్నాయి. వీఐపీలను ఉచితంగా కొండ దిగువ నుంచి దేవస్థానానికి తరలించేందుకు ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు అయ్యే డబ్బు చెల్లించిన అధికారులు భక్తులకు ఏర్పాట్ల విషయంలో నిధులు కేటాయించకుండా మిన్నకుండటం గమనార్హం. డబ్బు చెల్లించందే బస్సులు ఏర్పాటు చేయలేమని ఆర్టీసీ తేల్చి చెప్పింది. దీంతో బస్సులు ఏర్పాటు చేయండి డబ్బు చెల్లిస్తామని సదరు అధికారి తిరునాళ్ల సమీక్షా సమావేశంలో వెల్లడించారు. తిరునాళ్ల ఏర్పాట్ల నిధులపై సమావేశంలో చర్చ జరగకపోవడం గమనార్హం. అయితే కొండ దిగువన పారిశుధ్య పనులకు పంచాయతీలు, మండలపరిషత్‌ల నుంచి రూ.14.45 లక్షలు వసూలు చేసేందుకు కలెక్టర్ శివ శంకర్ లోతేటి ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే గత ఏడాది పంచాయతీల నుంచి రూ.5 లక్షలు వసూలు చేసినట్టు సమావేశంలో పంచాయతీ అధికారి వెల్లడించారు. అయితే ఈ ఏడాది రూ.14.45 లక్షలు వసూలుకు ఉత్తర్వుల విడుదలపై చర్చ జరుగుతోంది. మైనర్ పంచాయతీలు రూ.10వేలు, మేజర్ పంచాయతీలు రూ.20 వేలు, మండల పరిషత్‌ల నుంచి రూ.50 వేలు తిరునాళ్ల కోసం చెల్లించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అద్దంకిలో వైసీపీకి షాక్

- వైస్ చైర్మన్ సహా ఇద్దరు కౌన్సిలర్లు టీడీపీలో చేరిక
- మరో ముగ్గురు సిద్ధం.. మున్సిపాలిటీలో ఫ్యాన్ ఆధిపత్యానికి బ్రేక్
- అందరికీ సముచిత స్థానం కల్పిస్తామన్న ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్



ఎమ్మెల్యే రవికుమార్ సమక్షంలో టీడీపీలో చేరిన ముగ్గురు వైసీపీ కౌన్సిలర్లు

అద్దంకి, ఫిబ్రవరి 22: అద్దంకి మున్సిపాలిటీలో వైసీపీకి గట్టి షాక్ తగిలింది. వైస్ చైర్మన్‌తో పాటు ఇద్దరు కౌన్సిలర్లు పసుపు కండువా కప్పుకోగా మరో ముగ్గురు టీడీపీలోకి వచ్చేందుకు సిద్ధమయ్యారని సమాచారం. వీరు కాక మరికొందరు టీడీపీలోకి వస్తామని ఎమ్మెల్యేకు సమాచారం పంపగా ఆయన నిరాకరించినట్లు తెలిసింది. దీంతో అద్దంకి మున్సిపాలిటీలో వైసీపీ ఆధిపత్యానికి బ్రేక్ పడినట్లు అయ్యింది. మున్సిపాలిటీలో వైసీపీకి 13 మంది, టీడీపీకి ఏడుగురు కౌన్సిలర్‌లు ఉన్నారు. వీరిలో వైస్ చైర్మన్, 5వ వార్డు కౌన్సిలర్ దేసు పద్మేష్‌తో పాటు 8, 13 వార్డుల కౌన్సిలర్లు బొజ్జా వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో గురువారం టీడీపీలో చేరారు. జొన్నతాళి వద్ద క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే ఎన్నికలలో అందరూ కలిసి కట్టుగా పనిచేసి మెజార్టీ వచ్చేలా కృషి చేయాలన్నారు. వైసీపీ కౌన్సిలర్లను టీడీపీలో చేర్చుకుని ఎవర్నీ పదవుల నుంచి తొలగించడం తమ అభిమతం కాదన్నారు. గతంలో రెండుసార్లు అధికారంలో ఉంటే ఒకసారైనా ప్రతిపక్షంలో ఉండాలని కోరుకునే వాళ్లమని, తద్వారా లోటుపాట్లు తెలిసే అవకాశం ఉండేదన్నారు. అయితే జగన్మోహనరెడ్డి అధికారం చేపట్టిన తర్వాత ప్రతిపక్షంలో ఉండాలంటేనే భయపడే విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడుతో సహా అందరూ జగన్ బాధితులేనన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ పార్టీ అధ్యక్షుడు చిన్ని శ్రీనివాసరావు, వడ్డవల్లి పూర్ణచంద్రరావు, సందిరెడ్డి శ్రీనివాసరావు, భోజనపల్లి సత్యనారాయణ, గట్టుపల్లి రామారావు, దొప్పలపూడి ప్రసాద్, లహరి, టీడీపీ కౌన్సిలర్లు అత్తులూరి రమేష్, రంగిశెట్టి సుభాషిణి, కంపా రజని, మాగులూరి తిరుపతమ్మ, జహీరా తదితరులు పాల్గొన్నారు.

క్వారీల వద్దకు ఎందుకు వెళ్లారు?

- ఎమ్మెల్యే ఏలూరిని ప్రశ్నించిన అద్దంకి ఎస్‌హెచ్‌వో

మార్టూరు, ఫిబ్రవరి 22: ఆరుగురు గ్రానైట్ పరిశ్రమల యజమానులను గత నెల 31న అరెస్టు చేసిన కేసుకు సంబంధించి గురువారం టీడీపీ బాపట్ల లోక్‌సభ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు గురువారం మార్టూరు పోలీస్‌స్టేషన్‌లో విచారణ నిమిత్తం హాజరయ్యారు. ఈ నెల 13న ఆయనకు మార్టూరు పోలీసులు 41ఏ నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో ఈ విచారణకు వచ్చారు. విచారణకు ఎమ్మెల్యే ఏలూరి న్యాయవాది హాజరత్తయ్యతో హాజరయ్యారు. మార్టూరు, రాజుపాలెం వీఆర్వోలు సాయిప్రసన్న, బిల్లి అంకయ్య సమక్షంలో స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎస్సై రాజశేఖర్‌రెడ్డి విచారణ చేశారు. దాదాపు 45 నిమిషాలు విచారణ జరిగినట్లు తెలిసింది. గ్రానైట్ పరిశ్రమల యజమానులు, విజిలెన్స్ అధికారుల మధ్య జరిగిన గొడవలో ఏం జరిగింది, ఆ సమయంలో అక్కడకు ఎందుకు వెళ్లారు, అక్కడ జరిగిన గొడవను చూశారా అంటూ ఏలూరిని ఎస్‌హెచ్‌వో విచారణలో ప్రశ్నించినట్లు తెలిసింది. బాధితులైన గ్రానైట్ పరిశ్రమ యజమానులను నిందితులుగా చేర్చి వారిపై కేసు నమోదు చేయడం న్యాయమేనా.. ఇది ఎంతవరకు సబబంటూ ఎమ్మెల్యే ఎస్‌హెచ్‌వోను ప్రశ్నించినట్లు తెలిసింది. నెల్లూరు విజిలెన్సు అధికారి బాలాజీనాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారని, మరి గ్రానైట్ పరిశ్రమల యజమానులు ఇచ్చిన ఫిర్యాదుపై ఇంతవరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ఏలూరి ప్రశ్నించినట్లు తెలిసింది. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించడం సమంజసం కాదన్నారు. గ్రానైట్ పరిశ్రమలో జరుగుతున్న సంఘటనలపై తనకు సమాచారం రావడంతో ఒక ప్రజాప్రతినిధిగా అక్కడకు వెళ్లాల్సి వచ్చిందని, విచారణకు పూర్తిగా సహకారం అందిస్తానని ఏలూరి చెప్పినట్లు తెలిసింది. ఏలూరి విచారణకు వస్తున్నారన్న సమాచారంతో టీడీపీ నాయకులు షేక్ ఫరూక్, తాటి నాగేశ్వరరావు, కన్నెగంటి శ్రీనివాసరావు, మిన్నె కంటి రవికుమార్, శివరాత్రి శ్రీను, కామినేని జనార్దన్, పోలూరి సింగయ్య, గొట్టిపాటి వెంకట్రావు తదితర నాయకులు స్టేషన్ వద్దకు వచ్చారు.



మార్టూరు స్టేషన్‌లో విచారణకు హాజరై బయటకు వచ్చిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

రేంజ్‌లో మరికొందరు డీఎస్పీల బదిలీ

గుంటూరు, ఫిబ్రవరి 22: రేంజ్‌లో మరికొందరు డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల పలువురు డీఎస్పీలను బదిలీ చేసినా వారికి తిరిగి స్థాన చలనం కల్పించారు. బదిలీ అయిన డీఎస్పీల వివరాలు ఇలా ఉన్నాయి. ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్‌లో ట్రాఫిక్ 2 డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న ఈ అశోక్‌కుమార్‌గౌడ్‌ను తుళ్లూరు డీఎస్పీగా నియమించారు. తుళ్లూరు డీఎస్పీగా ఉన్న ఎం వెంకటేశ్వరరావును ఇంటెలిజన్స్‌కు బదిలీ చేశారు. నూజివీడు డీఎస్పి సీహెచ్ మురళీకృష్ణను బాపట్ల డీఎస్పీగా బదిలీ చేశారు. బాపట్ల డీఎస్పీ టీ వెంకటేశ్వర్లును ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ ట్రాఫిక్ 2 డీఎస్పీగా నియమించారు. ఏసీబీలో పనిచేస్తూ తూర్పుగోదావరి జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీగా అటాచ్మెంట్‌పై ఉన్న జీ శ్రీనివాసరావును పల్నాడు జిల్లా సీసీఎస్ డీఎస్పీగా నియమించారు. ఇంటెలిజన్స్ డీఎస్పీగా ఉన్న జీ లక్ష్మయ్యను నూజివీడు డీఎస్పీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- హాల్‌టిక్కెట్‌తో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలి
- అధికారులకు కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశాలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల, ఫిబ్రవరి 22: విద్యార్థులకు అత్యంత కీలకమైన పదో తరగతి, ఇంటర్మీడియట్, ఒకేషనల్ పరీక్షలను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. పరీక్షల నిర్వాహణపై అనుబంధశాఖల అధికారులతో గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ముందుగా జిల్లాల కలెక్టర్, అధికారులకు మంత్రి బొత్స సత్యనారాయణ వీడియో కాన్ఫరెన్స్‌లో పలు సూచనలు చేశారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఒకేషనల్, టెట్, డీఎస్సీ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో సమగ్ర ప్రణాళికతో అధికారులు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని, పరీక్షా కేంద్రాలలో కనీస సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. కేంద్రాలలోకి ఎలక్ట్రానిక్ డివైస్, ఫోన్, వాచీలు వంటి పరికరాలు అనుమతించరాదన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్‌టిక్కెట్ చూపిస్తే ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలన్నారు. సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించాలన్నారు. పరీక్షలు ముగిసే వరకు విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. కేంద్రాల సమీపంలో 144సెక్షన్ అమలు చేయాలన్నారు. స్పాట్ వాల్యూషన్ సెంటర్‌లో జిల్లా కేంద్రంలోనే ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 1 నుంచి 20 వరకు 35 కేంద్రాలలో జరుగుతాయని చెప్పారు. జిల్లా నుంచి 19,853 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతారన్నారు. పదో తరగతి పరీక్షలు 108 కేంద్రాలలో మార్చి 18 నుంచి 30 వరకు జరుగుతాయన్నారు. ఈ పరీక్షలకు 18,910 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. ఈ పరీక్షల కొరకు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఆరు బృందాలను నియమించామన్నారు. ఒకేషనల్ పరీక్షలు మార్చి 18 నుంచి 30 వరకు జరుగుతాయన్నారు. 1204 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతుండగా ఆరు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో ఇంటర్మీడియట్ ఆర్ఐవో పి.యర్రయ్య, డీఈవో నారాయణ, డీఎమ్‌హెచ్‌వో డాక్టర్ ఎస్. విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.



చెన్నైలో ఉండి బతికిపోయాడు

సంగీత దర్శకుడిపై డైరెక్టర్ ఫైర్



'సిద్ధార్థ్‌రాయ్' చిత్రం షూటింగ్ నిర్ణీత సమయంలోనే పూర్తి చేశాం. కానీ సంగీత దర్శకుడు రధన్ వల్ల పోస్ట్ ప్రొడక్షన్ ఆలస్యమైంది. అవుట్‌పుట్ విషయంలో నన్ను బాగా విసిగించాడు. తనతో చాలా విషయాల్లో వాగ్వివాదం జరిగింది. తను మంచి టెక్నీషియనే కానీ నన్ను మానసికంగా చిత్రవధ చేశాడు. చెన్నైలో ఉండి బతికిపోయాడు. లేకుంటే పెద్ద గొడవే జరిగేది. ఇలాంటి సంగీత దర్శకులకు దూరంగా ఉండాలి' అని దర్శకుడు వీ యశస్వి చిత్ర పరిశ్రమకు విజ్ఞప్తి చేశారు. ఆయన దర్శకత్వంలో దీపక్ సరోజ్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'సిద్ధార్థ్ రాయ్'. జయ అడపాక, ప్రదీప్ పూడి, సుధాకర్ బోయిన సంయుక్తంగా నిర్మించారు. నేడు ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా యశస్వి మాట్లాడుతూ 'సుకుమార్‌గారికి ఈ సినిమా బాగా నచ్చి, 'నీ తర్వాత సినిమా నా బేనర్‌లోనే చేస్తున్నాం' అని ప్రకటించారు. నేను ఊహించినదానికన్నా దీపక్ అద్భుతంగా నటించాడు. సిద్ధార్థ్‌రాయ్ ఒక డిఫరెంట్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది. ఇలాంటి కథ, పాత్ర ఇప్పటివరకూ రాలేదు' అని అన్నారు. దీపక్ సరోజ్ మాట్లాడుతూ 'సిద్ధార్థ్‌రాయ్' కథ విన్నాక ఆనంద భాష్పాలు వచ్చాయి. నటుడిగా నన్ను నిరూపించుకోవచ్చని ఈ సినిమా చేశాను. ఈ సినిమా కోసం యశస్వి చాలా కష్టపడ్డారు. నా పాత్ర ప్రేక్షకులకు గుర్తుండిపోతుందని నమ్ముతున్నాను' అని అన్నారు. ఇందులో తన పాత్ర చాలా ప్రత్యేకంగా ఉండబోతోందని కథనాయిక తన్వీ చెప్పారు.

నో లాజిక్ ఓన్లీ మ్యాజిక్

శ్రీ విష్ణు, రాహుల్ రామకృష్ణ, ప్రియదర్శి కలయికలో వచ్చిన 'బ్రోచేవారెవరురా' చిత్రం ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తింది. ఇప్పుడు మరోసారి ఈ కాంబినేషన్ సెట్టయింది. ఈ చిత్రానికి 'ఓం భీమ్ బుష్' అనే ఆసక్తికర టైటిల్‌ను ఖరారు చేశారు. 'నో లాజిక్ ఓన్లీ మ్యాజిక్' అనేది ఉపశీర్షిక. 'హుషారు' ఫేమ్ శ్రీహర్ష కొనుగంటి దర్శకత్వంలో వీ సెల్యూలాయిడ్‌తో కలసి సునీల్ బలుసు నిర్మిస్తున్నారు. యూవీ క్రియేషన్స్



సమర్పిస్తోంది. గురువారం మేకర్స్ ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసి, మార్చి 22న సినిమాను రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రీతీ ముకుందన్, అయేషాఖాన్ కథానాయికలు. ఈ చిత్రానికి సంగీతం: సన్నీ ఎంఆర్. సినిమాటోగ్రఫీ: రాజ్ తోట















ఎమ్మెల్యే అనగాని సమక్షంలో టీడీపీ పార్టీలో చేరుతున్న వైసీపీ శ్రేణులు

టీడీపీలోకి చేరిన వైసీపీ వర్గీయులు

చెరుకుపల్లి, ఫిబ్రవరి 2: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా శాసనసభ్యులు అనగాని సత్యప్రసాద్ కృషి చేస్తున్నారని అందుకే ఆకర్షితులమై వైసీపీ నుంచి టీడీపీ పార్టీలోకి చేరామని గ్రామస్తులు తెలిపారు. ఆరుంబాక, తుమ్మలపాలెం, పంచాయతీలలోని పులిగడ్డవారిపాలెం గ్రామాలకు చెందిన 20 కుటుంబాల వారు గురువారం టీడీపీలోకి చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి టీడీపీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పొలిటికల్ మేనేజర్ పూషడపు కుమారస్వామి, దాసరి సురేష్, కోటయ్య, సత్యనారాయణ, పులిగడ్డ నారాయణ, పలు కుటుంబాల సభ్యులు ఉన్నారు. రేపల్లె నియోజకవర్గ జనసేన సమన్వయకర్త మత్తి భాస్కరరావు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలతో కోట్లు దోచేశారు

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్

అచ్చంపేట, ఫిబ్రవరి 22: రాష్ట్రంలో ఇసుక అక్రమ తవ్వకాలతో వైసీపీ ప్రభుత్వం కోట్ల రూపాయలు దోచుకుంటుందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. గురువారం అచ్చంపేటలో షెడ్డు వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో శ్రీధర్ మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా 24 గంటలు తవ్వకాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్కో రీచ్‌లో రోజుకు రెండు వేల టన్నులు అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయన్నారు. పర్యావరణ మంత్రిత్వ శాఖ ప్రభుత్వానికి నివేదికలు అందించిందని, శాటిలైట్ చిత్రాల ద్వారా తవ్వకాలు, ఆధారాలు సేకరించారని నివేదికలో తెలిపారు. ఇసుకాసురుడు అరాచకాలు చేస్తున్నా ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టడం దారుణమని, ప్రభుత్వ అధికారులు అక్రమ దారులకు అడ్డగోలుగా అండదండలు అందిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, క్లస్టర్ ఇన్‌చార్జ్ బత్తుల శ్రీనివాసరావు, ఎస్‌కే కాసుల, పొన్నెకంటి రవి, నల్లమోతు హరిబాబు, సందెపోగు సామ్యేలు, రేపూడి తోమాస్, ఏసుపోగు నాగయ్య, నల్లపాటి చందు, మేకల వెంకటరావు, ఎనుముల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతుల త్యాగానికి దృశ్య రూపం 'రాజధాని ఫైల్స్'

- మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 22: రాష్ట్ర భవిష్యత్తు కోసం అమరావతి రైతులు చేసిన త్యాగానికి, స్వార్థ రాజకీయం, దోపిడీ కోసం సీఎం జగన్‌రెడ్డి చేసిన మోసానికి దృశ్య రూపమే 'రాజధాని ఫైల్స్' చిత్రమని అని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. గురువారం రైతులు, పార్టీ నాయకులతో కలసి ప్రత్తిపాటి చిలకలూరిపేటలో రాజధాని ఫైల్స్ చిత్రాన్ని వీక్షించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేవలం అహంతో, రాజకీయ కక్షతో ప్రపంచ స్థాయి నగర నిర్మాణ స్వప్నాలను ఛిదిమేసిన సీఎం జగన్ తప్పకుండా చూడాల్సిన చిత్రమిదని అన్నారు. చట్టసభలో అమరావతిని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నానని చెప్పి అంతలోనే నాలుక మడతవేసి అమరావతి రైతులను రోడ్డున పడవేసిన పాపాన్ని జగన్ జన్మజన్మలకు కడుక్కోలేరన్నారు. మరో రెండునెలల్లో రాష్ట్రానికి జగన్ గ్రహణం తొలగిపోయి మంచిరోజులొస్తాయని, తరతరాలకు చరిత్రలో నిలిచిపోయే రాజధాని నిర్మాణం పూర్తిచేసే బాధ్యత టీడీపీ జనసేన ఉమ్మడి ప్రభుత్వం తీసుకుంటాయన్నారు. ఇందుకుగాను ఉమ్మడి జిల్లా పరిధిలో మొత్తం వైసీపీకి అడ్రస్ లేకుండా చేసి టీడీపీ, జనసేన కూటమికి క్లీన్ స్వీప్ విజయాన్ని అందించాల్సిన బాధ్యత జిల్లా వాసులపై ఉందన్నారు.

మిర్చి.. పోటెత్తింది..

- యార్డుకు 2.50 లక్షల టిక్కీల రాక.. కిక్కిరిసిపోయిన ప్రాంగణం
- నేడు సరుకు తీసుకురావొద్దని రైతులకు మార్కెట్ కమిటీ విజ్ఞప్తి
- అలానే ప్రతీ బుధవారం కొత్తవి అనుమతించరాదని నిర్ణయం



మిర్చియార్డులో ఎరైవల్స్‌ని పరిశీలిస్తున్న మార్కెటింగ్ జేడీ శ్రీనివాసరావు

గుంటూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో మిర్చి ధరలు పతనం కావడంతో అక్కడి రైతులంతా గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ(మిర్చియార్డు) వైపు దృష్టి సారించారు. నిత్యం వందల సంఖ్యలో లారీలు, ట్రాక్టర్లు, ట్రక్కు ఆటోల్లో లక్షల టిక్కీలను విక్రయానికి తీసుకొస్తున్నారు. గుంటూరు, పల్నాడు, కర్నూలు, ప్రకాశం జిల్లాల నుంచి కూడా రైతులు మిర్చి విక్రయానికి తీసుకొస్తుండటంతో యార్డుప్రాంగణమంతా కిక్కిరిసిపోతుంది. బుధవారం సాయంత్రం మొదలుకొని గురువారం ఉదయం వరకు దాదాపుగా 2.50 లక్షల కొత్త మిర్చి టిక్కీలు యార్డుకు రైతులు తీసుకొచ్చారు. అంతకు ముందు రోజు విక్రయం జరగగా లక్ష టిక్కీల వరకు యార్డులో నిల్వ ఉండటం, కొత్తగా వచ్చిన వాటితో యార్డులో ట్రాఫిక్ ఎక్కడికక్కడ స్తంభించిపోయింది.

తేజ, బ్యాడిగి వంటి రకాలు నాణ్యత బావుంటేనే యార్డులో క్వింటాల్‌కు రూ.20 వేల ధర లభిస్తున్నది. క్వాలిటీ తగ్గితే మాత్రం క్వింటాల్‌కు రూ.13వేల ధర మాత్రమే ఎగుమతిదారులు చెల్లిస్తున్నారు. చాలాప్రాంతాల్లోని మొదటి కాపుని ఇప్పటికే రైతులు అమ్మేశారు. దీంతో ఆయా రైతులు రెండో కాపు కాయలను తీసుకొస్తున్నారు. సహజంగానే రెండో కాపు కాయలు కొంచెం పొట్టిగా ఉంటాయి. దీంతో వ్యాపారులు ధర తగ్గించేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్, ఖమ్మం మార్కెట్లలో ధర మరింత తక్కువగా ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. కర్ణాటకలోనూ ఇదే పరిస్థితి. ఇది కూడా ఇక్కడికి ఎరైవల్స్ పెరగడానికి ఒక కారణంగా మారింది.

రోజురోజుకు టిక్కీల రాక పెరుగుతూ యార్డులో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం అవుతుండటంతో గురువారం మార్కెట్ కమిటీ ఛైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, మార్కెటింగ్‌జేడీ కాకుమాను శ్రీనివాసరావు యార్డులో పర్యటించారు. దిగుమతి, ఎగుమతి వ్యాపార సంఘాల నాయకులు లేళ్ల అప్పిరెడ్డి, కుర్రి సాంబిరెడ్డి, జుగిరాజ్ భండారి, పొత్తూరి నరేంద్ర, తోట రామకృష్ణ, రమేష్, గ్రేడ్-2 సెక్రెటరీ ఆంజనేయసింగ్, ఇన్‌ఛార్జ్ పి.శ్రీకాంత్‌తో సమావేశమై చర్చించారు. గురువారం సరుకు ఎక్కువగా రావడంతో శుక్రవారం విక్రయానికి తీసుకొద్దామని ప్లాన్ చేసుకొన్న రైతులు రావొద్దని విజ్ఞప్తి చేశారు. తద్వారా శుక్రవారం యార్డులో నిల్వవున్న టిక్కీల ట్రేడింగ్ జరుగుతుందని, ఆ టిక్కీలన్ని శని, ఆదివారాల్లో బయటకు వెళ్లిపోతాయని చెప్పారు. కాగా పీక్‌సీజన్ కావడంతో ఇక నుంచి ప్రతీ మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం సాయంత్రం వరకు కొత్త ఎరైవల్స్‌ని అనుమతించరాదని నిర్ణయించారు. ఈవిషయాన్ని రైతులు గమనించి కమిటీకి సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.



మందడం రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న రైతులు

మూడు ముక్కలాటలు ఎంతోకాలం సాగవు

- దమ్ముంటే మాస్టర్‌ప్లాన్ ప్రకారం రాజధానిని అభివృద్ధి చేయాలి
- 1528వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్లూరు, ఫిబ్రవరి 23: పచ్చి అబద్ధాలతో సీఎం జగన్‌రెడ్డి కాలం వెల్లబుచ్చుతున్నారని రాజధానికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు గురువారం నాటికి 1528వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడుతూ, రాష్ట్రాన్ని నాశనం చేయటానికి పెట్టిన మూడు ముక్కల ఆటలు ఎంతకాలం సాగవన్నారు. ప్రత్యేక హోదా తెస్తానని చెప్పి ఆ ఊసే లేకుండా వైసీపీ ప్రభుత్వం మిన్నకుండి పోయిందన్నారు. హోదా గురించి అడుగుతారని మూడు రాజధానులను అంశం తీసుకొచ్చి ప్రజలను పక్కదారి పట్టించారన్నారు. ఇప్పటికైనా సీఎం జగన్‌రెడ్డి మూడు ముక్కలాటకు స్వస్తి పలకాలన్నారు. దమ్ము ధైర్యం ఉంటే రాజధాని అమరావతిని మాస్టర్‌ప్లాన్ ప్రకారం అభివృద్ధి చేయాలన్నారు. అప్పుడే రాష్ట్రం ప్రగతి బాటలో పయనిస్తుందన్నారు. అమరావతిని నాశనం చేయాలనుకుంటే మట్టి కొట్టుకు పోవటం ఖాయమన్నారు. జై ఆంధ్రప్రదేశ్ అంటూ దీపాలు వెలిగించి అమరావతి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. రాజధాని 29 గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి. తుళ్లూరు, మందడం, వెలగపూడి, అనంతవరం, నెక్కల్లు, వెంకటపాలెం తదితర రాజధాని గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.



సీజీజీబీ ఆర్ఎంకు వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘాల, ప్రజా సంఘాల నేతలు

బాధిత రైతులకు నష్ట పరిహారం

- బ్యాంక్ రీజనల్ మేనేజర్ శ్రీనివాసరావు వెల్లడి

క్రోసూరు, ఫిబ్రవరి 22: దొడ్లేరు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులో గోల్డ్ అప్రైజర్ నాగార్జున నిర్వాకం వల్ల బంగారం మాయం కాగా.. బాధిత రైతులకు త్వరలో నష్ట పరిహారం చెల్లిస్తామని బ్యాంక్ రీజనల్ మేనేజర్ సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం దొడ్లేరు సీజీజీబీలో ఆయన బాధితులతో మాట్లాడారు. గ్రాము బంగారానికి రూ.6,655 చొప్పున పరిహారం చెల్లించనున్నట్లు ఆయన తెలిపారు. తమ బంగారం కనపడ కుండా పోయిందని, 498 మంది అర్జీలు ఇచ్చారని, వారిలో 321 మందికి పరిహారం చెల్లించనున్నట్లు చెప్పారు. ఇంకా 98 మంది రైతులకు సంబంధిఇంచిన బంగారం మాయమైనట్లు ఎటువంటి ఆధారాలు లభించలేదని, నిశితంగా పరిశీలించి ఆధారాలు లభిస్తే వారికి కూడా పరిహారం చెల్లిస్తామన్నారు. ప్రస్తుతం ఉన్న ధరలో తరుగు తీసివేసి చెల్లిస్తామనటం భావ్యం కాదని, లబ్ధిదారుల తరపున ప్రజా సంఘాల నాయకులు, రైతు సంఘాల నాయకులు, రీజనల్ మేనేజర్‌కు చెప్పారు. రీజనల్ మేనేజర్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి తిమ్మిశెట్టి హనుమంతరావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గంజిమాల రవిబాబు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆవుల ఆంజనేయులు, కేవీపీఎస్ కార్యదర్శి ముత్యాల పౌలు, భవన నిర్మాణ సంఘం నాయకులు గారపాటి సుభానీ, నటరాజు, కోటి, నాగుల్ షరీఫ్, ఘన్ సైదా, ఆంజనేయులు నాయక్ తదితరులు ఉన్నారు.

వైసీపీ నేతల కనుసన్నల్లో అక్రమ ఇసుక రీచ్‌లు

- టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు



నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 22: వైసీపీ కనుసన్నల్లో 500 అక్రమ ఇసుక రీచ్‌లు ఉన్నాయని, ఇసుక అక్రమ తవ్వకాలు నిజమేనని హైకోర్టుకు ఎంఓఈఎఫ్ సమర్పించిన నివేదికకు సీఎం సమాధానం చెప్పాలని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇసుక మాఫియా పెట్రేగిపోతున్న జిల్లా కలెక్టర్లకు కనిపించక పోవడం దురదృష్టకరమన్నారు. అధికార వైసీపీ ఇసుక మాఫియా అక్రమంగా సీసీ కెమెరాలు, కంప్యూటర్ బిల్లులు లేకుండా రీచ్‌లో తవ్వకాలు జరుపుతూ రోజుకు రెండు వేల టన్నుల ఇసుకను తవ్వి విక్రయిస్తూ దోచుకుంటున్నారని అన్నారు. డిసెంబర్ నుంచి కృష్ణా, గుంటూరు జిల్లాలో జీసీకేసీ ప్రాజెక్టు సంస్థ భారీ యంత్రాలతో అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు చేస్తుందని, దీని వెనుక వైసీపీ నేతల హస్తం ఉందన్నారు. మంత్రి పెదిరెడ్డి రామచంద్రారెడ్డి సొంతజిల్లా చిత్తూరులో అక్రమ ఇసుక రవాణాపై రూ.18 కోట్లు జరిమానా విధించడం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. ఇసుకలో దోచుకున్న డబ్బుతో ఎన్నికలలో గెలవాలని జగన్‌రెడ్డి కుట్రలు చేస్తున్నారని, టీడీపీ అధికారంలోకి రాగానే వైసీపీ నేతలు బొక్కిన ఇసుక కుంభకోణాన్ని కక్కిస్తామన్నారు.

కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పదవికి

లేళ్ల వెంకటరావు రాజీనామా



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న లేళ్ల వెంకటరావు

క్రోసూరు, ఫిబ్రవరి 22: రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి క్రోసూరు మండలానికి చెందిన లేళ్ల వెంకటరావు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు రాష్ట్ర కాపు కార్పొరేషన్ అధ్యక్షునికి రాజీనామా లేఖను పంపుతున్నట్లు తెలిపారు. అచ్చంపేట, క్రోసూరు మండలాలకు చెందిన కాపు నేతల ఆత్మీయ సమావేశాన్ని గురువారం మండలంలోని ఉయ్యందనలో ఏర్పాటు చేశారు. 700 మంది అనుచరవర్గమూ వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. సంవత్సరకాలంగా స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తమ కులంపై కక్ష పెంచుకొని వేధింపులకు గురిచేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇటీవల తమకులానికి చెందిన ఓట్లను తొలగించారని, కాపు కులాన్ని నియోజక వర్గంలో అణగ దొక్కాలని చూస్తున్నారని, దీనికి సంబంధించిన వీడియోలు, సాక్షాధారాలు తమ వద్ద ఉన్నాయన్నారు. కొత్తపల్లికి చెందిన రంగిశెట్టి నరసింహారావు అనే వ్యక్తిపై అక్రమంగా 307సెక్షన్ కింద కేసు నమోదు చేశారన్నారు. మిట్టపాలెం గ్రామానికి చెందిన చిరు వ్యాపారస్తుడు నెల్లూరి శ్రీనివాసరావుపై విజిలెన్స్‌దాడులు చేయించారన్నారు. క్రోసూరులో కంభంపాటి రాము ఇంటర్నెట్ షాపుపై ఎమ్మెల్యే కుమారుడు, ఆయన అనుచరులు దాడులు నిర్వహించి షాపు ధ్వంసం చేశార న్నారు. తనతో పాటు 15 మంది కాపుకార్పొరేషన్ డైరెక్టర్లు అసంతృప్తిగానే ఉన్నారన్నారు. టీడీపీ ప్రభుత్వంలోనే కాపులకు న్యాయం జరిగిందని, ఉయ్యందన గ్రామంలో కాపు కార్పొరేషన్‌ద్వారా 70 మందికి రుణాలు, అనేక మందికి రూ.10లక్షల చొప్పున విదేశీవిద్య రుణాలు అందాయన్నారు. నియోజక వర్గంలోని కాపు పెద్దలతో చర్చించి తమ భవిష్యత్ కార్యాచరణను నిర్ణయించుకుంటామని ఆయన వెల్లడించారు.

రైల్వే అధికారుల

అలసత్వం

- భారీగా నిలిచిన ట్రాఫిక్



వేమూరులో రైల్వే ట్రాక్‌పై నిలిచిన ట్రాఫిక్

వేమూరు, ఫిబ్రవరి 22: వేమూరు రైల్వే గేటు వద్ద రోడ్డు మరమ్మత్తులు నిర్వహించే విషయంలో ఆ శాఖ అధికారులు అలసత్వం చూపారు. దీంతో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. రైల్వే గేటు సమీపంలో ఆర్ అండ్ బి రోడ్డు పూర్తిగా దెబ్బతింది. మరమ్మత్తులు చేసేందుకు పనులు ప్రారంభించారు. ముందుగా సమాచారాన్ని ప్రజలకు తెలియజేయలేదు. రెవెన్యూశాఖకు పంపిన లేఖను సంబంధిత అధికారులు ప్రకటించలేదు. దీంతో తెనాలి, కొల్లూరు ప్రధాన రహదారిపై ఉన్న ట్రాక్ దాటేందుకు ఆటంకం ఏర్పడింది. దాదాపుగా 9గంటల పాటు అంతరాయం ఏర్పడటంతో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లను ఎదుర్కొన్నారు. ఈ సందర్భంలో రైల్వే శాఖ సిబ్బందికి ప్రయాణికుల మధ్య వాగ్వాదం కూడా చోటు చేసుకుంది. ఎటువంటి సమాచారం లేనందున సమస్య ఏర్పడింది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	155, 164,175
చికెన్ విత్ స్కిన్	300.00
చికెన్ స్కిన్ లెస్	310.00

1,23,214 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 1,28,837 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,23,214 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 1,15,034 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9000	20500
నెంబరు. 5	13500	20000
273	12500	16800
341	10200	20500
4884	13500	19500
సూపర్ 10	15000	16500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8500	21000
బ్యాడిగి	9000	20500
దేవనూరు డీలక్స్	11500	20500
తెల్లకాయలు	5000	13000

బాలికతో వివాహేతర సంబంధం

- అధికార పార్టీ నేత కుమారుడిపై ఫోక్సో కేసు

పెదకాకాని, ఫిబ్రవరి 22: గుంటూరు జిల్లా పెదకాకాని మండలం అగతవరపాడు గ్రామానికి చెందిన అధికారపార్టీ ఎంపీటీసీ కుంచాల కోటిరెడ్డి కుమారుడైన 17 ఏళ్ల బాలుడిపై ఫోక్సో కేసు నమోదైంది. ఇతడు గ్రామానికి చెందిన 14ఏళ్ల బాలికతో మూడు నెలలుగా వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తున్నాడు. తొలుత ప్రేమిస్తున్నానంటూ నమ్మించి కొన్నినెలలుగా బాలికను వశపరచుకున్నాడు. అయితే రెండు రోజుల క్రితం పెళ్లి చేసుకోవాలని ఆ బాలిక నిలదీయడంతో అతడు అంగీకరించలేదు. పైగా సంబంధం గురించి ఎక్కడైనా చెప్తే చంపేస్తానని బెదిరించాడు. దీంతో భయాందోళనకు గురైన బాలిక తల్లిదండ్రుల ద్వారా పోలీసులకు ఫిర్యాదుచేసింది. ఈమేరకు అతడిపై పెదకాకాని పోలీసులు ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

చావలిలో కౌలు రైతు ఆత్మహత్య



శివ దుర్గాప్రసాద్ (ఫైల్)

వేమూరు, ఫిబ్రవరి 22: బాపట్ల జిల్లా వేమూరు మండలం చావలి గ్రామానికి చెందిన కౌలురైతు గోపాలం శివదుర్గాప్రసాద్(37) అప్పుల బాధతో బుధవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య కుమార్తె ఉన్నారు. పదేళ్లుగా దుర్గాప్రసాద్ నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. కౌలుతో పాటుసాగు నిమిత్తంగా పెట్టుబడి కోసం అప్పులు చేశాడు. సాగు కలసి రాక అప్పులు తీర్చలేకపోయాడు. దాదాపుగా నాలుగు లక్షల రూపాయలు అప్పులు కావడం, వాటిని తీర్చే దారి పరిస్థితి లేక దిక్కుతోచని పరిస్థితుల్లో బుధవారం రాత్రి ఇంటిలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నారు. కుటుంబసభ్యులు గమనించే సరికి అతడు మృతి చెందాడు. ఈ మేరకు కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు వేమూరు పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



షేక్ జానీబాష (ఫైల్)

మాచవరం, ఫిబ్రవరి 22: విద్యుదాఘాతానికి గురై రైతు మృతి చెందిన ఘటన మండలంలోని పిన్నెల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. దీనికి సంబందించి హెడ్‌కానిస్టేబుల్ అశోక్ తెలిపిన వివరాలిలా వున్నాయి. గ్రామా నికి చెందిన షేక్ జానీబాష(37) పొలా నికి నీళ్లు పెట్టేందుకు వెళ్లాడు. ట్రాన్స్ ఫార్మర్ పనిచేయక పోవడంతో ఫ్యూజు వేసేందుకు ప్రయత్నించాడు. ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య ఆషాబి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అశోక్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. జానీబాషకు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బాపట్ల వార్తలు



మహిళలకు చీరలు, సంచులు, కరపత్రాలు అందజేసి ఉమ్మడి మేనిఫెస్టో గురించి వివరిస్తున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ

ఉమ్మడి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేద్దాం

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, ఫిబ్రవరి 22: చేయిచేయి కలుపుదాం తెలుగుదేశం, జనసేన ఉమ్మడి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేద్దామని తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ తెలపారు. ఇంటింటికి తెలుగుదేశం, మీమాట-నాబాట, జనసేన, టీడీపీ జనబాట కార్యక్రమాన్ని బాపట్ల మండలం మరుప్రోలువారిపాలెం గ్రామంలో గురువారం రెండో రోజు కూడా నిర్వహించారు. పార్టీశ్రేణులతో కలిసి ఇంటింటికి వెళ్లి మహిళలకు చీరలు, సంచులు, కరపత్రాలను అందజేసి ఉమ్మడి మ్యానిఫెస్టో గురించి వివరించారు. ఈ సందర్భంగా నరేంద్రవర్మ మాట్లాడుతూ వైసీపీ అరాచకపాలనను సాగనంపి జనసేన, టీడీపీ సంక్షేమపాలనను స్వాగతించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

సమగ్ర ప్రణాళికతో ఎన్నికలు నిర్వహించాలి : కలెక్టర్

బాపట్ల, ఫిబ్రవరి 22 : సమగ్రప్రణాళికతో ఎన్నికలు నిర్వహించటానికి అధికారులు కమ్యూనికేషన్ వ్యవస్థను బలోపేతం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశించారు. ఈఆర్‌వోలు, జిల్లా నోడల్ అధికారులతో కలెక్టర్ ఛాంబర్‌లో గురువారం ఆయన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలకు అవసరమైన సామగ్రి, మానవవనరులు, వాహనాలను సమకూర్చుకోవాలని తెలిపారు. హెల్ప్‌లైన్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా ఎన్నికల కమిషన్ రూపొందించిన సి-విజిల్‌యాప్, ఈఎస్ఎంఎస్ యాప్, సువిధ, సక్ష్యంయాప్, ఎన్‌కోర్‌మేనేజ్‌మెంట్, ఎలక్ట్రానిక్ సీజర్ మేనేజ్‌మెంట్ విధానం అమలుతీరుపై అవగాహన చేసుకోవాలన్నారు. మైక్రో అబ్జర్వర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారుల విధివిధానాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఎన్నికల విధుల్లో ఉండే పీవోలకు బీఎస్ఎన్ఎల్ సర్వర్ అనుసంధానంతో సిమ్ కార్డులు ఇవ్వాల్సి ఉందన్నారు. జిల్లాకు 10మంది ఎన్నికల పరిశీలకులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించటానికి తీవ్ర సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద వీడియో కవరేజ్, వెబ్‌కాస్టింగ్ ఏర్పాటుపై వీడియో కెమెరామెన్‌లను సమకూర్చుకోవాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్, ఈఆర్‌వోలు, జిల్లా నోడల్ అధికారులు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.



ఈఆర్‌వోలు, జిల్లా నోడల్ అధికారులతో సమావేశమైన కలెక్టర్ రంజిత్‌బాషా

ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి ఘన నివాళి

బాపట్ల, ఫిబ్రవరి 22 : బ్రిటీష్ దుష్ట పరిపాలనను ఎదిరించి తిరుగుబాటు చేసిన తెలుగువీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞా సాంకేతిక కళాశాలలో గురువారం నిర్వహించారు. ఇన్‌చార్జి అసోసియేట్‌డీన్ డాక్టర్ సి.హెచ్ వివి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆయన పటానికి పుష్పాంజలి ఘటించి ఆయన సేవలను కొనియాడారు. కర్నూలు జిల్లాలోని రూపనగుడి గ్రామంలో జన్మించి ఉయ్యాలవాడలో పెరిగి పెద్దవాడయ్యాడని జానపద వీరగాథల వలన తెలుస్తుందన్నారు. కడప, కర్నూలు, అనంతపురం, బళ్ళారి జిల్లాలో 66 గ్రామాలకు అధిపతిగా ఉన్నారని తెలిపారు. ఆయన నిర్మించిన కోటలు, నగరాలు ఈనాటికి ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ విమల భీరా, డాక్టర్ ఎల్.ఏడుకొండలు, డాక్టర్ సి.హెచ్ సోమేశ్వరరావు, డాక్టర్ వై.ఫణేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నరసింహారెడ్డి పటానికి పుష్పాంజలి ఘటిస్తున్న అసోసియేట్ డీన్ డాక్టర్ వీవీ సత్యనారాయణ తదితరులు

ఘనంగా అంజుమన్ కమిటీ ప్రమాణ స్వీకారం

బాపట్ల, ఫిబ్రవరి 22 : బాపట్ల అంజుమన్ -ఎ-ఇస్లామియా నూతనకమిటీ ప్రమాణస్వీకారోత్సవం గురువారం అత్యంత ఘనంగా నిర్వహించారు. అధ్యక్షుడిగా అబ్దుల్ రహీంజానీ, ఉపాధ్యక్షులుగా షేక్ బాజివలి, షేక్ మహ్మద్ రఫీ, కార్యదర్శిగా అబ్దుల్ కరీమ్, కోశాధికారిగా షేక్ మీరాసాహేబ్‌లు ప్రమాణస్వీకారం చేశారు. కార్యవర్గ సభ్యులుగా అబ్దుల్ సత్తార్, షేక్.మౌలాలి, జనాబ్ ఆదం, జనాబ్ ఖాసీం, జనాబ్ ఖాదర్‌బాషా, జనాబ్ అబ్దుల్ మజీద్‌లు ప్రమాణ స్వీకారం చేసి కమిటీ అభివృద్ధికి పాటుపడతామని తెలిపారు. నూతన కమిటీని పలువురు ఘనంగా సత్కరించి సన్మానించారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న అంజుమన్-ఎ-ఇస్లామియా కమిటీ సభ్యులు

జనసేనలో చేరిన 50 ముస్లిం కుటుంబాలు



ముస్లిం మైనార్టీలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న వెంకటశివన్నారాయణ

బాపట్ల, ఫిబ్రవరి 22 : మండలంలోని వెదుళ్ళపల్లి గ్రామానికి చెందిన నూరుబాషాకాలీషా ఆధ్వర్యంలో 50 ముస్లిం మైనార్టీ కుటుంబాలు గురువారం జనసేనపార్టీలో చేరారు. పట్టణంలోని జనసేనపార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. శివన్నారాయణ మాట్లాడుతూ వెదుళ్ళపల్లి గ్రామంతోపాటు పట్టణంలోని 30, 31, 1వార్డులలో ముస్లిం మైనార్టీలు జనసేనపార్టీ పట్ల ఆకర్షితులై పార్టీలో చేరటం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఇమ్మడిశెట్టి మురళీకృష్ణ, షేక్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల డీఎస్పీగా మురళీకృష్ణ



డీఎస్పీ మురళీకృష్ణ

బాపట్ల, ఫిబ్రవరి 22 : బాపట్ల డీఎస్పీగా సీహెచ్ మురళీకృష్ణను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న టి.వెంకటేశులను ఎన్టీఆర్ జిల్లా ట్రాఫిక్-2 ఏసీపీగా బదిలీచేశారు. నూజివీడు ఏసీపీగా పనిచేస్తున్న మురళీకృష్ణను బాపట్లకు బదిలీ చేశారు.

టీడీపీ, జనసేనతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

● ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

చెరుకుపల్లి, ఫిబ్రవరి 21: రానున్న ఎన్నికల్లో వైసీపీ పాలనను తరిమికొడదామని రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీ, జనసేనతోనే సాధ్యమని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని గూడవల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన టీడీపీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానురాను వైసీపీ నాయకులు కుట్రలు, కుతంత్రాలకు తెరలేపుతూ ప్రజలను మభ్యపెట్టి తప్పుడు మార్గంలో గెలవాలని సోషల్ మీడియా ద్వారా కుటిల రాజకీయాలు చేస్తున్నారన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసిన 2024లో టీడీపీ, జనసేన ప్రభుత్వం అధికారంలోకి రావటం ఖాయమన్నారు. వైసీపీ పాలనలో అవినీతి, అరాచకాలు తప్ప రాష్ట్రాభివృద్ధి చేసిన దాఖలాలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ, గ్రామ అధ్యక్షుడు గోగినేని సీతారామయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పట్టెం సన్నీ, మైనార్టీ నాయకులు షరీఫ్, నాయకులు పూషడపు కుమారస్వామి, తాతా ఏడుకొండలు, ఆలపాటి మహిధర్, గోగినేని వసుధ, ఆలపాటి వెంకటసుబ్బయ్య, నిజాంపట్నం జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని తరిమికొట్టే రోజులు దగ్గర పడ్డాయి

● ఎమ్మెల్యే అనగాని సోదరుడు శివప్రసాద్



కార్యక్రమంలో మహిళలకు కరపత్రాలను అందిస్తున్న టీడీపీ నాయకులు

రేపల్లె, ఫిబ్రవరి 21 : వైసీపీని తరిమికొట్టే రోజులు దగ్గరపడ్డాయని ఎమ్మెల్యే అనగాని సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. మండలంలోని గుడికాయలంకలో గురువారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న పథకాలను ప్రజలకు వివరించారు. వైసీపీ ప్రజావ్యతిరేక విధానాలపై కరపత్రాలను ఇంటింటికి అందిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసిన రాబోయేది టీడీపీ, జనసేన సంయుక్త ప్రభుత్వమేనని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బాపట్ల పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీ తాతా ఏడుకొండలు, టీడీపీ మండల అధ్యక్షుడు రేపల్లె రామాంజనేయులు, మాజీ ఎంపీటీసీ యరగళ్ళ వీరయ్య, మాజీ సర్పంచ్ యరగళ్ళ శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు వేజళ్ళ పూర్ణానందం, కేసన రామకృష్ణ, పీవీ చింతారావు, పేరం శ్రీనివాసరావు, యరగళ్ళ వాసు, మోర్ల అంజయ్య, యరగళ్ళ మారయ్య, వుయ్యూరు సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న సాహితీవేత్త, వివేకా సర్వీస్ సొసైటీ కార్యదర్శి అంబటి మురళీకృష్ణ

వచన కవిత్వం తెలుగు సాహిత్యానికి వెలకట్టలేని సంపద

బాపట్ల, ఫిబ్రవరి 22 : వచన కవిత్వం తెలుగు సాహిత్యానికి వెలకట్టలేని సంపద అని పలువురు సాహితీవేత్తలు తెలిపారు. బాపట్ల మండలం వెదుళ్ళపల్లి గ్రామంలో ధృతి సంస్థ, వివేకా సర్వీస్‌సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో నెలనెల నందివర్ధనం, తరతరాలకు తెలుగుపలుకు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి వివేకాసర్వీస్ సొసైటీ కార్యదర్శి అంబటి మురళీకృష్ణ అధ్యక్షత వహించారు. ప్రముఖ సాహితీవేత్త గుంటూరు లక్ష్మీ నరసయ్య మాట్లాడుతూ 19వ శతాబ్దం నుంచి వెలుగులోకి వచ్చిన వచన కవిత్వం గత సాహిత్య నమూనాల కంటే ఎంతో భిన్నంగా సార్వజనీనత దిశగా అడుగులు వేస్తూ ప్రజాదరణ పొందిందన్నారు. కార్యక్రమంలో భాగంగా వివేకాసర్వీస్ సొసైటీ ప్రచురించిన ప్రాచీన-ఆధునిక సాహిత్యంలో మేరు శిఖరాలు రెండు గ్రంథాలను ఆవిష్కరించారు. అంబటి మురళీకృష్ణ సరళీకరించిన కట్టమంచి రామలింగారెడ్డి కవిత్వతత్వ విచారం గ్రంథాన్ని ధృతి సంస్థ ప్రచురించగా ఆ ప్రతులను వేదిక మీద ఆవిష్కరించారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ అనీల్ డాని, వివేకాసర్వీస్ సొసైటీ అధ్యక్షులు ఎన్‌వీవీ నాగరాజు, ధృతి సంస్థ అధ్యక్షులు కళ్ళం హరినాథరెడ్డి, కార్యదర్శి చాపల సుబ్రహ్మణ్యం, శీలం శ్రీనివాసరావు, ముప్వా శ్రీనివాసరావు తదితరులు ప్రసంగించారు. బాపట్ల, చీరాల, పొన్నూరు, గుంటూరు తదితర ప్రాంతాలు నుంచి సాహితీవేత్తలు, సాహితీప్రియులు పాల్గొన్నారు.

పశుసంవర్ధకశాఖలో క్లస్టర్ విధానాన్ని రద్దు చేయాలి

● ఏపీ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరీ ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ సేవనాయక్

బాపట్ల, ఫిబ్రవరి 22 : పశుసంవర్ధకశాఖలో క్లస్టర్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరీ ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ బి.సేవనాయక్ డిమాండ్ చేశారు. ఫెడరేషన్ బాపట్ల జిల్లా శాఖ కార్యవర్గ సమావేశం స్థానిక ఎన్జీవో హోంలో గురువారం జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. సమావేశానికి సేవనాయక్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ క్లస్టర్ విధానం వల్ల డిపార్ట్‌మెంట్‌లో ఉన్న 2 వేల మంది పారా వెటర్నరీ సిబ్బందిని ఇబ్బందులు పెడుతున్నారన్నారు. సమావేశంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి ఆర్ విజయసారధి, ఉమ్మడి గుంటూరు జిల్లా చైర్మన్ ఎ.రాజమోహన్, రంజిత్, రాజేష్, బీపీఆర్ వరప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

హామీలు అమలు చేయని ముఖ్యమంత్రికి బుద్ధి చెప్పాలి

● జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గంటా అంజిబాబు

బాపట్ల, ఫిబ్రవరి 22: గత ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయకపోవటం దుర్మార్గమని జిల్లా కాం గ్రెస్ అధ్యక్షుడు గంటా అంజిబాబు పేర్కొన్నారు. పార్టీ శ్రేణులతో కలిసి గురువా రం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన 6నెలలోనే కార్మిక, కర్షకులకు ఉపాధి కల్పిస్తామని, మద్యపానం నిషేధిస్తామని చెప్పి హామీల ఊసే లేకుండా చేశారన్నారు. పీసీసీ చైర్మన్ వైఎస్ షర్మిల ఆధ్వర్యంలో సచివాలయ ముట్టడికి పిలుపునిస్తే కాంగ్రెస్ నాయకులను, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేయటం దారుణమన్నారు. కేంద్రంలో నరేంద్రమోదీని ప్రశ్నించలేని ముఖ్యమంత్రి ఇక్కడ హక్కుల కోసం ప్రశ్నించే వారిని అరెస్టు చేయాలనుకోవటం సిగ్గుచేటు అన్నారు. అధికార, ప్రతిపక్ష నాయకులు రైతుల సమస్యలపై, క్రైస్తవులపై జరిగిన దాడులపై స్పందించకపోవటం సిగ్గుచేటు అన్నారు. సమావేశంలో తాడికొండ వెంకటేశ్వరరావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు దోనేపూడి దేవరాజు, మండల అధ్యక్షుడు పి.శంకరరెడ్డి, మాజీ కౌన్సిల్ బక్కా రోశయ్య, జె.సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పట్టణ పోలీసుస్టేషన్‌లో భద్రపరిచిన గ్రూప్-2 ప్రశ్నపత్రాలు

బాపట్ల, ఫిబ్రవరి 22 : గ్రూప్-2 ప్రశ్నపత్రాలను బాపట్ల పట్టణ పోలీసుస్టేషన్‌లో గురువారం భద్రపరిచారు. ఈ నెల 25వ తేదీ ఆదివారం గ్రూప్-2 పరీక్షలు జరగనున్నాయి. దీనికి సంబంధించిన ప్రశ్నపత్రాలను భద్రపరచగా జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ప్రశ్నపత్రాల వివరాలు గురించి ట్రెజరీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ యు.శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసుస్టేషన్‌లో భద్ర పరిచిన గ్రూప్-2 ప్రశ్నపత్రాల వివరాలు అడిగి తెలుసుకుంటున్న జేసీ శ్రీధర్

మృతునికి కుటుంబానికి ఆర్థికసాయం

కర్లపాలెం, ఫిబ్రవరి 22 : కర్లపాలెం మండలం పేరలిలో మల్లెలవారిపాలేనికి చెందిన మల్లెల రూపాస్‌పాల్ గురువారం మృతి చెందారు. ఎమ్మెల్యే కోన రఘుపతి ఆదేశాలతో డాక్టర్ బాలకృష్ణమూర్తి సహాయంతో పేరలి నరసయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎంపీటీసీ, మండల ఉపాధ్యక్షులు కాగిత బుల్లియ్య, మాజీ ఎంపీటీసీ గొర్రెముచ్చు మీరయ్య, కోఆర్డినేటర్ పేరలి శ్రీనివాసరావుల చేతులమీదగా మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు.

నేడు వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

కర్లపాలెం, ఫిబ్రవరి 22 : మండల పరిధిలోని గ్రామ పంచాయతీలలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని ఎంపీడీవో నేతాజి తెలిపారు.

దేశీయ మేలు జాతి దూడల ప్రదర్శన

కొల్లూరు, ఫిబ్రవరి 22: జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో దేశీయ మేలుజాతి దూడల ప్రదర్శన నిర్వహించారు. గురువారం కొల్లూరులోని పశు వైద్యశాలలో డిప్యూటీ డైరెక్టర్ బాలశంకర్ నేతృత్వంలో 55 మేలుజాతి దూడలను ప్రదర్శనగా ఉంచారు. వీటిలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన 33 దూడల యజమానులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. మిగిలిన 22 దూడలకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈడీఎఫ్ఏసీ పెదరావూరు డాక్టర్ కేదారేశ్వర్, వేమూరు, కొల్లూరు పశువైద్యులు జనార్దనరావు, బట్టు యశ్వంత్, కె.రాజేంద్ర ప్రసాద్, శ్రీనివాసరావు, జడ్పీటీసీ సుబ్బారావు, వైస్ ఎంపీపీ రాంబాబు, వైసీపీ నాయకులు కమ్మెల సాంబశివరావు, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థినికి అభినందనలు

వేమూరు, ఫిబ్రవరి 22: పవిత్ర వేల్ఫర్ సొసైటీ ఆధ్వర్యంలో చెరుకుపల్లిలో బుధవారం నిర్వహించిన బాపట్ల జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ పోటీల్లో జంపని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరో తరగతి విద్యార్థిని టి.హేమలక్ష్మి తన ప్రతిభను కనబరిచింది. జిల్లా స్థాయిలో ఆరో ర్యాంకు సాధించి సొసైటీ సభ్యుల అభినందన తో ప్రశంసాపత్రం అందుకుంది. ఈ సందర్భంగా గురువారం జంపని పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు నరసింహా స్వామి అధ్యక్షతన విద్యార్థిని హేమలక్ష్మిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సహ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసీపీ జెండాలతో వలంటీర్లకు పురస్కారాలు



వైసీపీ జెండాలతో వలంటీర్లకు పురస్కారాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి, నాయకులు

బాపట్ల, ఫిబ్రవరి 22: ఉత్తమసేవలందించిన గ్రామ, వార్డు వలంటీర్లకు సేవా మిత్ర, సేవారత్న, సేవావజ్ర పురస్కారాల పంపిణీ కార్యక్రమాన్ని బాపట్ల వ్యవసాయ కళాశాలలోని డాక్టర్ బీవీ నాథ్ ఆడిటోరియంలో గురువారం నిర్వహించారు. పట్టణ, మండలాలకు సంబంధించి నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే కోన రఘుపతితోపాటు వైసీపీ నాయకులు హాజరయ్యారు. పురస్కారాలు అందించేటప్పుడు వైసీపీ జెండాలు ఊపుతూ వలంటీర్లను సత్కరించి పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు కాగిత సుధీర్‌బాబు, కోకి రాఘవరెడ్డి, ఇనగలూరి మాల్యాద్రి, గవిని కృష్ణమూర్తి, జోగి రాజా, ఇనపగోళ్ళ రంగారావు, ఎంపీపీలు చిన్న పోతుల హరిబాబు, యారం వనజ, కుర్రా రమాదేవి, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ పిన్నిబోయన ప్రసాద్, సుబ్బారావు, జడ్పీటీసీ పి.ఎస్తేరు రాణి, అధికారులు పాల్గొన్నారు.

చీకటి జీవోను రద్దు చేయాలి

రేపల్లె, ఫిబ్రవరి 21: ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ టైటలింగ్ చట్టాన్ని ప్రభుత్వం పునరాలోచించి తీసివేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేసన గోపాలరావు అన్నారు. న్యాయవాదులు చేస్తున్న రిలే దీక్ష గురువారానికి 47వ రోజుకు చేరింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అసోసియేషన్ సభ్యు లు సంఘీభావం తెలిపారు. దీక్షా శిబిరంలో కంచర్ల వెంకట్రావు, కలిశెట్టి శ్రీనివాసరావు, చుకోరి లక్ష్మణ్‌రావు, బేతపూడి వీరయ్యలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టైటలింగ్ చట్టం 27/22ను రద్దు చేయకుంటే రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. దీక్షా శిబిరంలో న్యాయవాదులు ఎ.మధుసూదనరావు, ఎం.సుబ్బారావు, పి.భూషణం, కె.వీరరాఘవులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులందరికి పింఛన్లు ఇవ్వాలి

చెరుకుపల్లి, ఫిబ్రవరి 22: అర్హులైన చేనేత కార్మికులందరికీ పింఛన్ ఇవ్వాలని చేనేత కార్మిక సంఘ రాష్ట్ర కార్యదర్శి గొట్టిముక్కల బాలాజీ అన్నారు. గురువారం తహసీల్దార్ బ్రహ్మయ్యకు వినతిపత్రం అందజేశారు. ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మికులను పింఛన్ మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినా ప్రభుత్వ పింఛన్ ఇవ్వకుండా నిలుపుదల చేశారన్నారు. చేనేత కార్మికులకు జనవరి నెల నుంచి వృద్ధాప్య పెన్షన్ వస్తుందని భావించిన కార్మికులు నిరాశకు గురిచేసిందన్నారు. కార్యక్రమంలో చేనేత సంఘ నాయకులు మర్రివాడ వెంకటరావు, సత్యనారాయణ, జి.మురళీకృష్ణ, శివనాగేశ్వరరావు, శ్రీరంగం, జి.శ్రీనివాసరావు, బి.మురళీ, శ్రీనివాసరావు, జి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు కృషి

రేపల్లె, ఫిబ్రవరి 22: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితే ఆ కుటుంబాలు సుఖసంతోషాలతో తమ పిల్లలను ఉన్నత చదువులను చదివించేందుకు దోహదపడుతుందని ఎంసీఏ కోశాధికారి నల్లూరు రమేష్ అన్నారు. గురువారం స్థానిక మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ హాల్లో డాక్టర్ పుట్టగుంట వేణుగోపాలరావు సౌజన్యంతో మహిళలకు ఫ్యాషన్ డిజైన్ శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ మోడరన్ కుట్లపై మూడు నెలలు శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ పూర్తి చేసుకుంటే తద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందుతారని ఆశిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగామ్ కోఆర్డినేటర్ సాయిప్రసాద్, ఎంసీఏ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిబాధితుడికి ఆర్థికసాయం అందజేత

కర్లపాలెం, ఫిబ్రవరి 22: కర్లపాలెం పంచాయతీలోని ఎంవీ రాజుపాలెంకు చెం దిన కోమట్ల అర్జునరెడ్డికి చెందిన మూడెకరాల గడ్డివామి అగ్ని ప్రమాదంలో ఇటీవల దగ్ధమైంది. గురువారం ఈ విషయం తెలుసుకున్న నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నరేంద్రవర్మ రూ.10వేలను పార్టీ నాయకులు పిట్ల వసంతరెడ్డి, పిట్ల వేణుగోపాలరెడ్డి ద్వారా అర్జునరెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో పి.చంద్రశేఖర్‌రెడ్డి, భైరాగి శ్రీనివాసరెడ్డి, పిట్టు కాసులరెడ్డి, ఆట్ల కేశవరెడ్డి, పిట్టు రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా శ్రీషిరిడిసాయిబాబా వార్షిక వేడుకలు

బాపట్ల, ఫిబ్రవరి 22: పట్టణంలోని కారుమూరి హనుమంతరావు నగర్‌లో ఉన్న షిరిడిసాయిబాబా మందిరం 19వ వార్షిక వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం గణపతిపూజ, సాయినాథుని అభిషేకం అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు తుమ్మా రంగారెడ్డి, కారుమూరి హరిప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన భక్తజనం అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

టీడీపీ ఎమ్మెల్యే అనగానిపై అసత్య ప్రచారం

● నీచ రాజకీయాలకు పాల్పడుతున్న వైసీపీ

● ఫేక్ ప్రచారం చేస్తున్న వాళ్లను గుర్తించి, శిక్షించాలి

● రేపల్లె పోలీస్ స్టేషన్‌లో టీడీపీ శ్రేణుల ఫిర్యాదు

రేపల్లె, ఫిబ్రవరి 22: ఓటమి భయంతో వైసీపీ నీచ రాజకీయాలకు, అసత్య ప్రచారాలకు పాల్పడుతోందని రేపల్లె నియోజకవర్గం టీడీపీ శ్రేణులు మండిపడుతున్నాయి. రేపల్లె టీడీపీ ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ వైసీపీ నుంచి పోటీ చేస్తున్నారంటూ వైసీపీ సోషల్ మీడియా హోరెత్తించింది. నియోజకవర్గంలో పలువురికి అదే సమాచారంతో ఐవీఆర్ఎస్ కాల్స్ వచ్చాయి. దీనిపై తెలుగు తమ్ముళ్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ శ్రేణులు గురువారం రేపల్లె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాయి. తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరాయి. రేపల్లె నియోజకవర్గంలోని ప్రజలకు, టీడీపీ కార్యకర్తలకు 8038461556 నంబరుతో ఫోన్ వస్తోందని, ట్రూ కాలర్‌లో ఆ నంబరు సీహెచ్ సత్యప్రసాద్ పేరుతో కనిపిస్తోందని తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా, గురువారం ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ఎక్స్ సామాజిక మాధ్యమంలో దీనిపై స్పందించారు. 'వైసీపీ చిల్లర ఆడియో కాల్స్‌కు కంగారు పడకండి.. ఆ కాల్ నాకు కూడా వచ్చింది. విని కడుపుబ్బా నవ్వుకున్నాను. మీరు కూడా విని నవ్వుకుని వదిలేయండి. రేపల్లెలో పసుపు జెండా ఎగరటం ఖాయం... మనం హ్యాట్రిక్ కొట్టటం ఖాయం..!' అని పేర్కొన్నారు. తన పోస్టుకు 'వైసీపీ చీప్ ట్రిక్స్', 'అనగాని ఫర్ రేపల్లె', 'ఫరెవర్ విత్ టీడీపీ'... హ్యాష్ ట్యాగ్స్‌ని జత చేశారు. దీనిపై ఎమ్మెల్యే అనగాని మాట్లాడుతూ, '8038461556 నంబర్ నుంచి నాకూ ఐవీఆర్ఎస్ కాల్ వచ్చింది. ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ వైసీపీ నుంచి పోటీ చేస్తున్నారు. రాజ్యసభ సీటు ఆశిస్తున్నారు... అంటూ వినిపించిన వాయిస్ కాల్‌తో ముందు ఒకింత ఆశ్చర్యానికి గురయ్యా' అని అన్నారు.

పత్రికా స్వేచ్ఛను కాలరాస్తున్న ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి

● నిరసన ర్యాలీలో పలు పార్టీల నేతలు, పాత్రికేయులు



వేమూరులో ర్యాలీలో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు, నియోజకవర్గంలోని పాత్రికేయులు

వేమూరు, ఫిబ్రవరి 22: పత్రికా స్వేచ్ఛను కాలరాస్తున్న ప్రభుత్వానికి బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందని, ముఖ్యమంత్రి సమక్షంలోనే విలేకరిపై దాడి హేయమైన చర్య అంటూ పలు పార్టీల నాయకులు, పాత్రికేయులు ఆగ్రహం వ్యక్తపరిచారు. ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిని, కర్నూలులోని ఈనాడు దినపత్రిక కార్యాలయంపై దాడిని నిరసిస్తూ గురువారం వేమూరులో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిరసన ర్యాలీ నిర్వ హించారు. బస్టాండ్ సెంటర్ నుంచి ప్రధాన రహదారిపై నినాదాలు చేసుకుంటూ జరిపిన ర్యాలీలో దాడికి పాల్పడిన వ్యక్తులను అరెస్టు చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అక్రమాలను ప్రజల ముందుకు తీసుకువెళుతున్న పాత్రికేయులపై, అలాగే ప్రతిక ప్రతినిధులపై దాడికి దిగడం హేయమైన చర్య అని అన్నారు. కృష్ణా పశ్చిమ డెల్టా సాగునీటి సంఘం మాజీ చైర్మన్ మైనేని మురళీకృష్ణ మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి రానున్న ఎన్నికల్లో ఓటమిపాలు అవుతారన్న విషయాన్ని గమనించి భయంతోనే ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఊస రాజేష్, జిల్లా పార్టీ మహిళా విభాగం కార్యదర్శి సోమరౌతు అనురాధ, టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ హనీఫ్, బాపట్ల జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు దొప్పలపూడి సుధాకర్, అన్నే వీరాంజనేయ ప్రసాద్, మున్నంగి విజయ్, కోగంటి శ్రీనుబాబు, బండారు నాగరాజు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభం

భట్టిప్రోలు, ఫిబ్రవరి 22: మండలంలోని భట్టిప్రోలు పంచాయతీ అద్దేపల్లి గ్రామంలో టీటీడీ రూ.10 లక్షలు, దాతాల విరాళాలతో నూ తనంగా నిర్మించిన సీతారామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు గురువారం అత్యంత వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరగనున్న ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం గంగానయనం, గణపతిపూజ, పుణ్యాహావాచన, రక్షా బం ధనం, మాతృకా పూజ, యాగశాల ప్రవేశం, కలశస్థాపనములను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం మృత్యుంగ్రహణం, అంకురా రోపణ, అగ్ని ప్రతిష్ఠ, దీక్షా హోమం, జలాధివాసములను మంత్రోచ్ఛ రణలతో జరిపించారు. శుక్రవారం గ్రామ పురవీధుల్లో ప్రతిష్ఠామూర్తులకు గ్రామోత్సవం నిర్వహిస్తారు. గాలిపాలెం వెంకయ్యస్వామి పీఠాధిపతులు చిన్న వెంకయ్యస్వామి పర్యవేక్షణలో ప్రతిష్ఠా మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.

ముగిసిన శ్రీమద్రామాయణ ప్రవచనాలు

కొల్లూరు, ఫిబ్రవరి 22: 55వ వార్షిక శ్రీమద్రామాయణ నవాహ్ని క జ్ఞానయజ్ఞ మహోత్సవ ప్రవచనలు గురువారం ముగిశాయి. కొల్లూరులోని పార్వతీ సంస్కృత పాఠశాల ఆధ్యాత్మిక మండపంలో ఈనెల 14వ తేదీన జరుగుతున్న రామాయణ ప్రవచనాలు గురువారం ముగిశాయి. తంగిరాల రాజేంద్రప్రసాద్ శర్మ రామాయణాన్ని ప్రవచించారు. 23వ తేదీన విష్ణు సహస్రనామ పారాయణం, సీతారామ పట్టాభిషేక మహోత్సవం, ఊరేగింపు అనంతరం పండిత సన్మాన కార్యక్రమాలు జరుగుతాయని శంకర సేవా సమితి ప్రతినిధులు డాక్టర్ భాగవతుల సూర్యనారాయణమూర్తి, కల్లూరి వెంకటసూర్యనారాయణమూర్తి పేర్కొన్నారు.

ఓటర్ల సమస్య పరిష్కారంలో అలసత్వం వద్దు

వేమూరు, ఫిబ్రవరి 22 : నియోజకవర్గంలోని ఓటర్ల సమస్యల పరిష్కార విషయంలో బూత్‌లెవల్ అధికారులు ఏ మాత్రం అలసత్వం చూపొద్దని, మూడు రోజుల్లోగా వాటిని పూర్తిగా పరిష్కరించాలని నియోజకవర్గం ఎన్నికల అధికారి ఎన్ఎస్‌వీవీ వసంతరాయుడు ఆదేశించారు. గురువారం స్థానిక రోశయ్య మీటింగ్ హాల్లో నియోజకవర్గ స్థాయి బీఎల్వోలు మాస్టర్ లెవల్ ట్రైనర్స్‌కు ప్రత్యేక అవగాహన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో అధికారి మాట్లాడుతూ ఫామ్ 6, 7, 8 దరఖాస్తుల నివేదికలను పరిశీలించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతతో పని చేయాలన్నారు. సమావేశంలో నియోజకవర్గ ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, కొల్లూరు, భట్టిప్రో లు, అమర్తలూరు, తహసీల్దార్లు పుల్లారావు, పద్మావతి, కవిత, 233 మంది బీఎల్వోలు, 20మంది మాస్టర్ లెవల్ ట్రైనర్స్ కార్యాలయ సిబ్బంది హాజరయ్యారు.

కల్లబొల్లి మాటలతో బీసీలను మోసం చేయలేరు

● సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీను

భట్టిప్రోలు, ఫిబ్రవరి 22: కల్లబొల్లి మాటలతో బీసీ వర్గాలను మో సం చేయలేరని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి బి. శ్రీను పేర్కొన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా గురువారం మండలంలోని ఐలవరంలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని పార్లమెంటు నియోజకవర్గపరిధిలో మూడు అసెంబ్లీ స్థానాలను బీసీలకు కేటాయించాలన్నారు. ఆధిపత్య కులాలు పాలక పార్టీల నిర్వహణలో బీసీలను ఓటు బ్యాం కుగా నే గుర్తిస్తే రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు రాష్ట్రంలోని అన్ని కులసంఘా ల ముఖ్యనేతలను ఏకతాటిపైకి తీసుకువచ్చి పటిష్టమైన సంఘ నిర్మాణాన్ని చేపడుతున్నారని ఆయన తెలిపారు. నియోజకవర్గా ల వారీగా బీసీ గర్జనలను నిర్వహించి వైసీపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్ర మంలో జిల్లా ఉపాధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్, నియోజకవర్గ అధ్యక్షుడు రాయన ప్రసాద్, జిల్లా కార్యదర్శి ఈడె శ్రీను, బీసీ నాయకులు కూరపాటి రఘురామయ్య, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

కొల్లూరు, ఫిబ్రవరి 22: మద్యం అక్రమంగా విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ రవీంద్రారెడ్డి గురువారం తెలిపారు. బొద్దులూరుపాడులో బెల్టు షాపు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ సిబ్బందితో ఆకస్మిక దాడులు నిర్వహించారు. దాడిలో 12 మద్యం క్వార్టర్ బాటిల్స్ స్వాధీనం చేసుకుని మద్యం విక్రేతను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

'గుండ్లకమ్మ'లో ఇసుక తవ్వకాలు


నీరు లేక ఖాళీగా ఉన్న రిజర్వాయర్

- రిజర్వాయర్‌లో నీరు లేకపోవటంతో మరింత సులువుగా మారిన వైనం
- మణికేశ్వరం వద్ద నాడు అడ్డగింత.. నేడు మిన్నకుండటంపై విమర్శలు


గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో మణికేశ్వరం వద్ద ఇసుక తవ్వకాలతో ఏర్పడ్డ గోతులు


గుండ్లకమ్మ రిజర్వాయర్ లోపలకు వెళ్ళేందుకు వీలుగా రోడ్డు ఏర్పాటుకు ట్రాక్టర్‌తో తీసుకు వస్తున్న గ్రావెల్

అద్దంకి, ఫిబ్రవరి 22: ఇసుకాసురుల కన్ను ఇప్పుడు ఏకంగా గుండ్లకమ్మ రిజర్వాయర్‌పై పడింది. ఇప్పటివరకు గుండ్లకమ్మ నది పరివాహక ప్రాంతాలలో మాత్రమే ఇసుక తవ్వకాలు జరిగాయి. గత రెండు మూడు రోజులుగా ఏకంగా గుండ్లకమ్మ రిజర్వాయర్‌లోనే చేస్తున్నారు. అద్దంకి మండలం మణికేశ్వరం, కొరిశపాడు మండలం అనమనమూరు మధ్య గత ఏడాది డ్రెడ్జర్‌ల ద్వారా ఇసుక తవ్వకాలు ప్రారంభించారు. అప్పట్లో మణికేశ్వరం, అనమనమూరు గ్రామాల వైసీపీ నేతల ఒత్తిడితో ఏఎంసీ మాజీ చైర్మన్, అప్పటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సోదరుడు భద్రారెడ్డి ఇసుక తవ్వకాలు జరిగే ప్రాంతాన్ని పరిశీలించారు. వైవీ సుబ్బారెడ్డి ద్వారా జిల్లా అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి ఇసుక తవ్వకాలు నిలిపి వేయించారు. దీంతో ఆయా గ్రామాల రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

అయితే, గత రెండు రోజులుగా అదే ప్రాంతంలో ఎక్స్‌కవేటర్‌ల ద్వారా ఇసుక తవ్వకాలు ప్రారంభించారు. ట్రాక్టర్‌లు నేరుగా రిజర్వాయర్ లోపలకు వెళ్లి ఇసుక లోడింగ్ చేసుకునేందుకు వీలుగా కొత్తగా రోడ్డు కూడా ఏర్పాటుచేస్తున్నారు. రిజర్వాయర్‌లో నీటి నిల్వ ఎక్కువగా లేకపోవటంతో ఇసుక తవ్వకాలకు మరింత అవకాశం ఏర్పడింది. అయితే, గతంలో ఇసుక తవ్వకాలను వ్యతిరేకించి అడ్డుకున్న రెండు గ్రామాల వైసీపీ నేతలు ప్రస్తుతం మిన్నకుండటం విమర్శలకు తావిస్తుంది. అదేసమయంలో అప్పట్లో స్వయంగా రంగంలోకి దిగిన వైవీ సోదరులు కూడా ఇప్పుడు దృష్టి పెట్టకపోవటం కూడా విమర్శలకు తావిస్తుంది.

అద్దంకి ప్రాంతంలో గుండ్లకమ్మ నదిలో ఇసుక తవ్వకాలకు ఎలాంటి రీచ్ లేదని ఇటీవల మైనింగ్ అధికారులు వాహనాలు సీజ్ చేసినప్పటికి ఏకంగా రిజర్వాయర్ పరిధి లో ఇసుక తవ్వకాలు చేపట్టడం పలువురు ని ఆశ్చర్యానికి గురి చేస్తుంది. ఎక్స్‌కవేటర్‌లతో ఇసుక తవ్వకాలు చేస్తుండటంతో భవిష్యత్‌లో సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రిజర్వాయర్ పరిధిలో ఇసుక తవ్వకాలు నిలిపివేసే విధంగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

పోలింగ్ బూత్‌లను పరిశీలించిన ఎన్నికల అధికారి

ఇంకొల్లు, ఫిబ్రవరి 22: ఇంకొల్లు మండలం పరిధిలోని 54 పోలింగ్ బూత్‌లను గురువారం పర్చూరు నియోజకవర్గ ఎన్నికల అధికారి కావేటి వెంకటేశ్వర్లు పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాలు, భద్రత, తదితర అంశాలను పరిశీలించారు. కొన్నిచోట్ల విద్యుత్‌దీపాలు, ర్యాంపులు తదితర సౌకర్యాలు లేనివి గుర్తించి తక్షణమే ఏర్పాట్లుచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బీఎల్వోల నుంచి పలు అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రమీల, డీటీ గీత, ఏఎస్‌వో పుష్పలత, సుధీర్, వీఆర్వోలు సురేష్, కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

25న 'ప్రబంధ యుగకర్త ఎర్రా ప్రగడ' గ్రంథావిష్కరణ

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 22 : పద్య సారస్వత పరిషత్ జాతీయ అధ్యక్షుడు, మహాకవి ఎర్రన వంశీయులు చదలవాడ లక్ష్మీనరసింహారావు పరిశోధానత్మక దృష్టితో శ్రమించి రచించిన ప్రబంధ యుగకర్త ఎర్రాప్రగడ గ్రంథావిష్కరణ ఈనెల 25వతేదీన ఒంగోలులోటని బ్రాహ్మణ సేవా సమితి కమ్యూనిటి హాలులో నిర్వహిస్తున్నట్లు పరిషత్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మాగంటి శ్రీరామమూర్తి, పింగళి పూర్ణచంద్రరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

బ్రిటానియా కంపెనీ రిటైర్డ్ అధికారి చదలవాడ బాబా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ ఎండీ జీవీ.సుబ్బారెడ్డి గ్రంథాన్ని ఆవిష్కరిస్తారని, డాక్టర్ కడిమళ్ల వరప్రసాద్ సమీక్షకులుగా వ్యవహరిస్తారు. ఈ కార్యక్రమంలో కవులు, రచయితలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

వైసీపీ నేతల బరితెగింపు

- అడ్డగోలుగా గ్రావెల్ మట్టి తరలింపు
- అనుమతులు లేకుండా ప్రభుత్వ, అటవీ భూముల్లో గ్రావెల్ తవ్వకాలు
- మండల పరిషత్ ద్వారా గామాల్లో మట్టి రోడ్లకు నిదులు
- పట్టించుకోని అధికారులు


కొప్పెరపాలెం పరిదిలో ఉన్న ఫారెస్టు కొండ భూమిలో గ్రావెల్ తవ్వకాలు


సూరేపల్లి చెరువులో అనుమతులు లేకుండా జరుగుతున్న మట్టి తవ్వకాలు

బల్లికురవ, ఫిబ్రవరి 22: బల్లికురవ మండలంలోని పలు గ్రామాల్లో వైసీపీ నేతలు జోరుగా మట్టి, గ్రావెల్ తవ్వకాలను చేపడుతున్నారు. అధికారులు మాత్రం ఇవేమి తమకు కనిపించవు అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ భూములతో పాటు అటవీ భూములలో కూడా అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా యంత్రాలను ఏర్పాటుచేసి తవ్వకాలు చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. సార్వత్రిక ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో కొందరు వైసీపీ చోట నేతలు మట్టి రోడ్లపై దృష్టి పెట్టారు. సుదూరం నుండి మట్టి తెచ్చి రోడ్లు వేసిన్నట్లు రికార్డు చేసి పెద్ద మెత్తంలో బిల్లులు మార్చుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బల్లికురవ మండల ప్రజా పరిషత్ కార్యాలయం ద్వారా ఇటీవల పలు గ్రామాల్లో ఉన్న వైసీపీ నేతలకు సుమారు కోటి రూపాయల పైబడి గ్రామాలలో మట్టి రోడ్లు వేసేందుకు నిధులు మంజూరు చేశారు. ఒక్కో నేతకు రూ.అయిదు లక్షల నుంచి రూ.పది లక్షల వరకు వర్కులు పెట్టారు. మట్టి రోడ్లు ఏర్పాటుకు అనుమతులు ఉన్నచోట నుంచి గ్రావెల్, మట్టి కొనుగోలు చేసి రోడ్లు వేయాల్సి ఉంది. అయితే, సీనరేజ్ కట్టకుండానే కొందరు వైసీపీ నేతలు గ్రామాల్లోనే అందుబాటులో ఉన్న ప్రభుత్వ, అటవీ భూముల నుంచి గ్రావెల్, మట్టి తవ్వకాలు చేపట్టి రోడ్లు వేస్తున్నారు. రోడ్లకు వేస్తున్న గ్రావెల్ మాత్రం మూడు కిలోమీటర్ల పైబడి నుంచి తీసుకువచ్చినట్టు రికార్డు చేయిస్తున్నారు. గ్రావెల్‌కు కూడా సీనరేజ్ కట్టినట్లు నమోదు చేయిస్తున్నారు. గ్రామాల్లో ఉన్న కొండలు గుట్టలలో ఉన్న మట్టిని సైతం వదలకుండా తవ్వకాలు చేస్తుండటంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలోని సూరేపల్లి, కొణిదెన, గంగపాలెం, గొర్రెపాడు, మక్కేశ్వరం, చెన్నుపల్లి, సజ్జాపురం, కూకట్లపల్లి, రామాంజనేయపురం, గుంటుపల్లి, వల్లాపల్లి, వైదన, కొప్పెరపాలెం, ఉప్పుమాగులూరు, వెలమవారి పాలెం, తదితర గ్రామాల పరిదిలో ఉన్న ప్రభుత్వ, అటవీ భూముల ద్వారా గ్రావెల్, మట్టి తవ్వకాలు పెద్ద ఎత్తున తవ్వుతున్నారు. దీంతో ప్రభుత్వానికి రావాల్సిన సీనరేజ్ ఆదాయం పెద్దమొత్తంలో పోతుందని ప్రజలు వాపోతున్నారు. గ్రామాలలో వేస్తున్న రోడ్లకు కూడా నాసిరకం మట్టిని తోలుతున్నారని, అధికారులు కూడా సరిగా పట్టించుకోవటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఎన్నికలు దగ్గర పడుతుండటంతో వేగంగా రోడ్లు ఏర్పాటుచేసి నిధులు డ్రా చేసుకొనేందుకు నేతలు తహతహలాడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారుల వెంటనే గ్రామాలలో జరగుతున్న మట్టి రోడ్ల పనులను పరిశీలించి సక్రమంగా జరిగేలా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులు చేపట్టాలి

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 22: జిల్లాలో నిలిచిపోయిన ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతుల ప్రక్రియను వెంటనే చేపట్టాలని ఎస్టీయూ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం ఒంగోలులో డీఈవో సుభద్రను కలిసి వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయుల సర్వీసు రెగ్యులరైజేషన్, ప్రొబేషన్ డిక్లరేషన్‌కు ప్రత్యేకంగా మేళాలు నిర్వహించాలని, తెలుగు, హిందీ ఉద్యోగోన్నతులు పొంది స్థానాలు కేటాయించకుండా హైస్కూళ్లలో పనిచేస్తున్న వారికి నోషనల్ పీరియడ్‌గా పరిగణించి ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. 50 సంవత్సరాలు దాటిన వారు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నందున వారికి టెన్త్ స్పాట్ వాల్యువేషన్ నుంచి మినహాయించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.ఎర్రయ్య జి.నరసింహారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సీహెచ్.శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 22 : అగ్నికుల క్షత్రియ కులంపై కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బహిరంగ క్షమాపణలు చెప్పాలని అగ్నికుల క్షత్రియ మత్స్యకార సంఘం జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఒంగోలులోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే కొండబాబుపై ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి అత్యంత దారుణంగా కులం పేరుతో తిట్టడం దుర్మార్గంగా ఉందన్నారు. రాష్ట్రంలో 40 లక్షలకు పైగా అగ్నికుల క్షత్రియ మత్స్యకార ఓటర్లు ఉన్నారని, వారి మనోభావాలు దెబ్బతీసే విధంగా మాట్లాడటం దారుణంగా ఉందన్నారు. ద్వారంపూడి క్షమాపణలు చెప్పకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేసి అన్ని నియోజకవర్గంలో మత్స్యకార ఓటర్లను చీలుస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కన్వీనర్ నాయుడు గోపాల్, దమ్ము శ్రీను, రాసాని కృష్ణ, అవనిగడ్డ బాలకృష్ణ, సింగోతు గోవిందు, తంబు ఏడుకొండలు, కొక్కిలిగడ్డ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 22: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని రిజిస్ట్రార్ హరిబాబు పిలుపునిచ్చారు. ఒంగోలులోని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలో గురువారం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ మానవాళి మనుగడను కాపాడేందుకు తప్పకుండా మొక్కలు నాటాలని కోరారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త హర్షప్రీతం దేవ్‌కుమార్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువుల వినియోగం పెరగడం వల్ల అనేక అనార్థాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో ఐసీడీఎస్‌కు నిధులు పెంచాలి

ఒంగోలునగరం, ఫిబ్రవరి 22: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ కేటాయింపుల్లో ఐసీడీఎస్‌కు నిధులు పెంచాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ డిమాండ్ చేశారు. స్థానిక ఎల్బీజి భవన్‌లో ఏపీ వర్కర్సు అండ్ హెల్పర్సు యూనియన్ ఒంగోలు అర్బన్ ప్రాజెక్టు మహాసభలో ఆ యన మాట్లాడారు. ఈ సభల్లో రమేష్ మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఐసిడిఎస్‌కు బడ్జెట్ నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. బడ్జెట్ కేటాయింపుల్లో నామమాత్రంగా కేటాయింపులు చేస్తూ అంగన్వాడీ, ఆశ, మిడ్‌డే మీల్స్ పథకాల్లో ఎక్కువగా పని చేస్తున్న మహిళలకు గౌరవ వేతనం పేరుతో కనీస వేతనాలను అమలు చేయ టం లేదన్నారు. కనీస వేతనాలను అమలు చేయకుండా మహిలలతో వెట్టిచాకీరీ చేయించుకుంటున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాల్లో పని చేస్తున్న మహిళలకు కనీస వేతనాలను అమలుచేయాలని కోరుతూ పోరాటాలను ఉధృతం చేయాల్సిన సమయం ఆసన్నమయిందన్నారు. అంగన్వాడీ వర్కర్సు అండ్ హెల్పర్సు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదర అన్నపూర్ణ మాట్లాడుతూ అంగన్వాడీలు తమ డిమాండ్ల కోసం 42 రోజుల పాటు చేసిన సమ్మె కారణంగా ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందాలకు సంబంధించిన మినిట్స్ కాపీలను జీవో రూపంలో ఇవ్వాలని కోరారు. సమ్మె సందర్భంగా ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందాల ను వెంటనే అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. వీటి అమలుకోసం మరో పోరాటానికి సిద్ధంగా కావాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ మహాసభలకు సిహెచ్‌జ్యోతి, కేవీ సుబ్బమ్మ, పద్మ, సంధ్యారాణి అధ్యక్షత వర్గంగా వ్యవహరించారు. ఈ మహాస భల్లో మాజీ జిల్లా కార్యదర్శి ప్రశాంతికుమారి, శ్రామిక మహిళ జిల్లా నాయకురాలు వి.కల్పన, సీఐటీయూ ఒంగోలు నగర అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ రాంబాబు, టి.మహేష్, దామా శ్రీనివాసులు, కొత్తపట్నం మండల కార్యదర్శి స్వామిరెడ్డి, యూనియన్ నాయకులు శ్రీదేవి, శోభారాణి, మహాలక్ష్మి, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

అబుల్ కలాంఅజాద్‌కు నివాళులు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 22: దేశ తొలి విద్యాశాఖ మంత్రి, భారతరత్న మౌలనా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతి సందర్భంగా గురువారం ఒంగోలులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉప గ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య ఆజాద్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సిబ్బంది కె.సంపూర్ణమ్మ, ఎస్.అనిల్, స్మైలి పాల్గొన్నారు.

వైసీపీకి గుణపాఠం తప్పదు!


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

మార్టూరు, ఫిబ్రవరి 22: వచ్చే ఎన్నికల్లో వైసీపీకి గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. మండలంలోని ఇసుకదర్శిలో గల క్యాంపు కార్యాలయంలో గురువారం సాయంత్రం మార్టూరు క్లస్టర్ వన్ నాయకులు, కార్యకర్తలు, పేజీ నేస్తంలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో టీడీపీ గెలుపు పర్చూరు చరిత్రలో నిలిచిపోయే విదంగా ఉండాలని, కార్యకర్తలందరూ పోరాట పటిమతో పని చేయాలని పిలుపు నిచ్చారు. అధికార పార్టీ నాయకులు గెలుపు కోసం టీడీపీ నాయకుల ఆత్మస్థయిర్యాన్ని దెబ్బతీసేవిధంగా కుట్రలు చేస్తున్నారని చెప్పారు. వాటికి భయపడకుండా వారి కుట్రలను తిప్పి కొట్టాలన్నారు. వైసీపీకి ఓట్లు వేయరని భావించిన టీడీపీ ఓట్లను తొలగించాలని ప్రయత్నిస్తున్నారని, వారి వ్యూహానికి అడ్డుకట్ట వేయాలని ఏలూరి పిలుపునిచ్చారు. దుర్మార్గుడైన ఒక వ్యక్తి స్వార్ధానికి రాష్ట్రం సర్వనాశనమవుతున్న విషయాన్ని ప్రజలకు చెప్పేందుకు ప్రతి కార్యకర్త ముందుండాలన్నారు. ప్రతి ఓటును పోలింగ్ బూత్ వరకు తీసుకువచ్చే విదంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. భయభ్రాంతులకు గురిచేయాలని ప్రయత్నిస్తున్న అధికార పార్టీ నాయకులకు గుణపాఠం చెప్పే సమయం వచ్చిందన్నారు. పర్చూరు నియోజకవర్గంలో మూడు తరాలు వారికి టీడీపీ గెలుపు గుర్తుండాలన్నారు. మన గెలుపు ద్వారా రాష్ట్ర చరిత్రలో తెలుగు దేశం పార్టీ నూతన అధ్యాయానికి నాంది పలకాలన్నారు.

ఓట్లను తొలగించాలనుకున్న వారికి సహాయ సహకారాలు అందించిన అధికారులు బలయ్యారన్నారు. రాబోయే ఎన్నికలు రాష్ట్ర చరిత్రను మార్చగలవన్నారు. భావితరాలు వారు అభివృద్ధిలో పయనిస్తున్న ఆంధ్రప్రదేశ్‌ను చూడాలంటే చంద్రబాబు ముఖ్య మంత్రిగా ఉండాలని కోరుకుంటున్నారన్నారు. ప్రజల ఆకాంక్ష, ఆశ, భవిష్యత్తు, బతుకు దెరువు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం ద్వారానే నెరవేరుతాయని అందరూ భావిస్తున్నారని ఎమ్మెల్యే సాంబశివరావు పేర్కొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి


మాట్లాడుతున్న వెంకటేష్

చీరాల, ఫిబ్రవరి 22: ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ అన్నారు. గురువారం స్థానిక ఎస్ఆర్ పీఎం హైస్కూల్ ప్రాంగణంలోని ఓపెటీలో జరిగిన వలంటీర్ల వందనం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజలకు సక్రమంగా సేవలు అందించినప్పుడే వలంటీర్ వ్యవస్థకు పూర్తిస్థాయిలో గుర్తింపు ఉంటుందన్నారు. అనంతరం పురస్కారాలకు ఎంపికైన వలంటీర్లకు పశంసాత్రం, మెడల్స్ ఇచ్చి సత్కరించారు.

స్థానిక జవహర్‌నగర్‌లో శ్రీజానకీ రామాంజనేయ స్వామి ఆలయంలో గురువారం నిర్వహించిన పాలరాతి విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవంలో వెంకటేష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అలాగే, వేటపాలెంలోని మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన వలంటీర్ల వందనం కార్యక్రమంలో పాలగ్గొన్నారు. వలంటీర్లకు పతకాలు, ప్రశంసాపత్రాలు ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రూతమ్మ, ఏవో కాశీవిశ్వనాధ్, సర్పంచ్ కందేటి అరుణ, నాయకులు బొడ్డు సుబ్బారావు, పల్లపోలు శ్రీనివాసరావు, దంతం మంతు, ఆవుల అశోక్, అందె కృష్ణ, కట్టా గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

టెన్త్, ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 22 : జిల్లాలో జరగనున్న ఇంటర్మీడియట్, పదో తరగతి, డీఎస్సీ, టెట్ పరీక్షలను ఎలాంటి పొరపాట్లు లేకుండా సజావుగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. గురువారం ఆయా పరీక్షల నిర్వహణపై తాడేపల్లి నుంచి విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, స్కూలు ఎడ్యుకేషన్ కమిషనర్ సురేష్‌కుమార్, ఇంటర్ ఎడ్యుకేషన్ కమిషనర్ సౌరభ్ గౌర్, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి ప్రవీణ్‌ప్రకాష్‌లు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం స్థానిక అధికారులతో కలెక్టర్ దినేష్‌కుమార్ ఆయా అంశాలపై సమీక్షించారు. మార్చి 1నుంచి 20వతేదీ వరకు ఇంటర్, మార్చి 18నుంచి 30తేదీ వరకు పదో తరగతి పరీక్షల నిర్వహణకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే జిల్లాలో డీఎస్సీ, టెట్ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సిటింగ్‌తో పాటు లైటింగ్, తాగునీరు, మరుగుదొడ్లతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తుతో పాటు పరీక్షలు జరిగే సమయంలో జిరాక్స్ సెంటర్లు మూయించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఫస్ట్ ఎయిడ్ కిట్స్‌తో పాటు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు నిషేదమని స్పష్టం చేశారు. పరీక్షల సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. సమస్యాత్మక పరీక్షా కేంద్రాల వద్ద గట్టి నిఘా ఉంచాలని, పరీక్షా కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలని, ఈ విషయంపై తల్లిదండ్రులకు, విద్యార్థులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో డీఈవో సుభద్ర, ఆర్ఐవో సైమన్‌విక్టర్, ఆర్టీసీ ఆర్ఎం సుధాకర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్‌పై అదనంగా డబ్బులు వసూలు చేస్తే చర్యలు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 22 : జిల్లాలో గ్యాస్ వినియోగదారుల నుంచి డెలివరీ బాయ్స్ రవాణా చార్జీల పేరుతో డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ గురువారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఏజెన్సీ షోరూం నుంచి వినియోగదారుని ఇంటి వరకు 15 కిలోమీటర్ల లోపు దూరం ఉంటే ఎటువంటి రుసుం డెలివరీ బాయ్స్‌కు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఈ నిబంధనలు గ్రామీణ, పట్టణ, సెమీఅర్బన్ అన్ని ప్రాంతాలకు, అన్ని గ్యాస్ ఏజెన్సీలకు వర్తిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

నిబంధనలు అతిక్రమించిన ఏజెన్సీలపై క్రమశిక్షణ చర్యలు తప్పవని జేసీ హెచ్చరించారు. వినియోగదారులు కూడా ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలపై అవగాహన పెంచుకొని సేవలు పొందాలన్నారు. ఎవరైనా డెలివరీ బాయ్స్ అసలు ధర కన్నా అధికంగా వసూలు చేస్తూ 8008301512 సెల్ నెంబరులో ఫిర్యాదు చేయాలని ఆయన వినియోగదారులను కోరారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

కావూరివారిపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 22: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఈపూరుపాలెం ఎస్సై మర్రి శివకుమార్ హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం రాత్రి కావూరివారిపాలెం గ్రామస్థులకు నేర నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఓటర్లు వారి హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవచ్చునని చెప్పారు. అలాగే, ఈపూరుపాలెం సెంటర్‌లో వాహనాలు తనిఖీ చేసి సరైన పత్రాలు లేని పలువురికి చలానాలు విధించారు. నలుగురు మద్యం బాబులపై కేసులు నమోదు చేశారు.

రైతు మృతికి కేంద్రప్రభుత్వం బాధ్యత వహించాలి

మార్టూరు, ఫిబ్రవరి 22: ఢిల్లీ సరిహద్దులో మద్దతు ధరకు చట్టబద్ధత కల్పనకు కేంద్ర ప్రభుత్వం తీర్మానం చేయాలని కోరుతూ బుధవారం ధర్నా చేస్తున్న రైతులపై పోలీసులు చేసిన దాడిలో చనిపోయిన యువ రైతు హర్బజన్ సింగ్ మృతికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని మండల రైతు సంఘం కమిటీ నాయకులు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా గురువారం సాయంత్రం మార్టూరు సెంటర్లో నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బత్తుల హనుమంతరావు, కందిమళ్ల రామకోటేశ్వరరావు, పేర్ని నాగేశ్వరరావు, శేషాద్రి, రాంబాబు, వీరవల్లి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన కలిగిఉండాలి

యద్దనపూడి(మార్టూరు), ఫిబ్రవరి 22: హెచ్‌ఐవీపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలంటూ చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం ఆధ్వర్యంలో నాటకం ద్వారా ప్రదర్శన నిర్వహించారు. గురువారం సాయంత్రం యద్దనపూడి మండలంలోని పూనూరు గ్రామంలో ప్రధాన సెంటరులో కళాజాతర నాట్య మండలి రత్నరాజు ఆధ్వర్యంలో ప్రదర్శన ఏర్పాటుచేశారు. ఈవ్యాధి పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారి గాలి స్వరూప్ కుమార్, లింక్ వర్కరు జి.నాగమల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కాపు సంక్షేమసేన నియోజకవర్గ అధ్యక్షుడిగా సందీప్ తేజ

పర్చూరు, ఫిబ్రవరి 22: కాపు సంక్షేమ సేన నియోజకవర్గ అధ్యక్షుడిగా కారంపూడి సందీప్ తేజ నియమితులయ్యారు. కాపు సంక్షేమ ఎగ్జిక్యూటీవ్ కమిటీ తీర్మానం మేరకు బాపట్ల జిల్లా అధ్యక్షుడు తరణి గోపాలకృష్ణ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఉపాధ్యక్షులుగా నారిశెట్టి రవితేజ, అనిశెట్టి నరేంద్రకుమార్, తెలగనేని వెంకటేష్‌లు నియమితులయ్యారు. జనరల్ సెక్రటరీగా తోట మణికుమార్ నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు నియామక పత్రాలను అందజేసినట్లు జనసేనులు తెలిపారు. జనసేన, తెలుగుదేశం సంయుక్త ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సందీప్ తేజ తెలిపారు.

యువతను చైతన్యవంతం చేయాలి

చీరాల, ఫిబ్రవరి 22: తొలిసారి ఓటు అర్హత పొందిన యువతను చైతన్యవంతం చేసి మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ అనే నినాదంతో శ్రేణులు ముందుకు సాగాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య తనయుడు గౌరీ అమర్‌నాథ్ పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం నియోజకవర్గ లీడర్స్, వారియర్స్ సమావేశం జరిగింది. నియోజకవర్గం నుంచి గౌరీ అమర్‌నాథ్, లావేటి శ్రీనివాసతేజ, వెంగళ భరత్‌లను యువత నాయకులుగా నియమించారు. వారియర్స్‌గా కర్పూరపు సుబ్బలక్ష్మి, పర్వాణ షేక్, నిన్నకోట జగదీష్, అవ్వారు తారక్, వెలిది అమర్, నాసిక ఆనంద్‌లను నియమించారు. కార్యక్రమంలో బాపట్ల పార్లమెంట్ యువత ప్రతినిధి మొవ్వ శరత్‌చంద్ర, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ కుస్తీ పోటీలకు అద్దంకి యువకుడు ఎంపిక


కట్టా దినేష్‌ను అభినందిస్తున్న కాకాని రాధాకృష్ణమూర్తి

అద్దంకి, ఫిబ్రవరి 22: జాతీయ కుస్తీ పోటీలకు అద్దంకి పట్టణంలోని నంబూరిపాలెంకు చెందిన యువకుడు కట్టా దినేష్ ఎంపికయ్యాడు. ఈనెల 28న పంజాబ్‌లో జరిగే పోటీలలో పాల్గొననున్నాడు. పంజాబ్‌కు వెళ్ళేందుకు అవసరమైన ఖర్చులకు వైసీపీ అద్దంకి పట్టణ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి రూ.5 వేలు అందజేశారు. దినేష్‌ను అభినందించారు.

గ్రామీణ ప్రాంతాలలో శుద్ధజలం అందించటమే ధ్యేయం

అద్దంకి, ఫిబ్రవరి 22: గ్రామీణ ప్రాంతాలలో శుద్ధ జలం అందించటమే ధ్యేయమని సింక్రోని స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి వెంకట్ అన్నారు. మండలంలోని చెరువుకొమ్ముపాలెం లో అసిస్ట్, సింక్రోణి స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఏర్పాటుచేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో అసిస్ట్ ప్రతినిధి డేవిడ్, ఎన్టీఆర్ మెమోరియల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీ రత్తయ్య తదితరులు పాల్గొన్నారు. వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు సహకరించిన ఎమ్మెల్యే రవికుమార్, అసిస్ట్, సింక్రోణి ప్రతినిధులకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

దళిత మహాసభను జయప్రదం చేయాలి

చీరాలటౌన్, ఫిబ్రవరి 22: గుంటూరులో మార్చి 2న జరిగే దళిత మహాసభను జయప్రదం చేయాలని పలువురు దళిత నాయకులు పేర్కొన్నారు. గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో కత్తి పద్మారావు రచించిన దేశం మాదే పుస్తకావిష్కరణ, మహాసభ జరుగనుంది. ఈక్రమంలో సంబంధిత కరపత్రాన్ని గురువారం మండల పరిధిలోని విజయ్‌నగర్ కాలనీలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కరత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు దుడ్డు భాస్కరరావు, తేళ్ల వెంకటస్వామి, గొర్రెపాటి రవికుమార్, సుందరరావు, దేవదానం, రవి, మార్క్, చౌదరి, నాగభూషణం, శ్రీను, సురేష్, ముసలయ్య, లక్ష్మయ్య, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

మెరిసిన గ్రామీణ విద్యార్థిని


అవార్డు అందుకుంటున్న రాజరాజేశ్వరి

కారంచేడు (పర్చూరు), ఫిబ్రవరి 22: కారంచేడు మండల పరిధిలోని రంగప్పనాయుడువారిపాలెం గ్రామానికి చెందిన రావెల్ల వీరరాఘవయ్య, శ్రీదేవి దంపతుల కుమార్తె రావెల్ల రాజరాజేశ్వరికి సెంట్రల్ గవర్నమెంట్ నేషనల్ అవార్డు(అలెగ్జాండర్ గ్రహంబెల్ అవార్డు)ను సొంతం చేసుకుంది. చీరాల ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్‌ను పూర్తిచేసిన రాజరాజేశ్వరి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ అండ్ సైబర్ సెక్యూరిటీ విభాగంలో ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన పరీక్షకు హాజరయ్యారు. పరీక్షలో అత్యధిక ప్రతిభను కన పరిచి అవార్డుకు ఎంపికయ్యారు. ఈ అవార్డును ఈనెల 21న న్యూఢిల్లీలో రోడ్డు అండ్ హైవేస్ మినిష్టర్ నితిన్ గట్కరీ చేతుల మీదుగా రాజరాజేశ్వరి అందుకున్నారు. బెంగుళూరులో ఫుల్‌స్టాక్ డెవలప్‌మెంట్‌లో పూర్తిస్థాయి శిక్షణ పొందినట్టు చెప్పారు. అవార్డు తనకు దక్కటం అదృష్టంగా భావిస్తున్నానని రాజరాజేశ్వరి తెలిపారు. గ్రామీణ విద్యార్థినికి దేశస్థాయిలో అవార్డు రావటం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

అద్దంకి, ఫిబ్రవరి 22: అద్దంకి పట్టణం సమీపంలోని నల్లవాగులో గుర్తుతెలియని మృతదేహం కుళ్లిపోయి ఉంది. పోలీసుల కథనం మేరకు.. అద్దంకి-మేదరమెట్ల రోడ్డుకు తూర్పువైపున నల్లవాగులో గురువారం సాయంత్రం పురుషుడు మృతదేహం ఉన్నట్లు సమాచారం అందటంతో పరిశీలించారు. సుమారు 50 సంవత్సరాల వయస్సు ఉంటుందని, ఐదారు రోజుల క్రితం మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయుడికి దేహశుద్ధి?

కారంచేడు(పర్చూరు), ఫిబ్రవరి 22: కారంచేడు మండల పరిధిలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో బాలికపట్ల అసభ్యంగా ప్రవర్తించాడని ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేసిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. విద్యను అందించాల్సిన ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తించారని ఆగ్రహానికి గురైన గ్రామస్థులు దేహశుద్ధి చేశారు. ఈ విషయం వెల్లడిస్తే తమ గ్రామానికి చెడ్డపేరు వస్తుందని స్థానికులు సమాచారం చెప్పేందుకు నిరాకరించారు. ఈవిషయంపై డిప్యూటీ ఈవో శ్రీనివాసరావును వివరణ కోరగా ఉన్నతాధికారులకు నివేదిక అందజేసినట్టు తెలిపారు.